
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 29 జూలై 2025
**** గరిష్ఠం 30.5 కనిష్ఠం 23.4



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	584.70 (296.5695)	1,47,195	42,913
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.20 (3.99)	1,604.61	1,904.00
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	158.463 (23.8180)	26,281	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.137 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులకు వరదనీరు పోటెత్తుతోంది. నాగార్జునసాగర్, మూసీ, డిండి, శాలిగౌరారం, అక్కంపల్లి, బ్రాహ్మణవెల్లంల రిజర్వాయర్లన్నీ పూర్తిస్థాయి నీటిమట్టాలకు చేరడంతో నిండుకుండల్లా మారిపోయాయి. మూసీ ప్రాజెక్టులు, కాల్వల కింద ఇప్పటికే సాగునీటిని విడుదల చేయగా, ఆయకట్టులో నాట్లు కొనసాగుతున్నాయి. నాగార్జునసాగర్, డిండి, ఏఎమ్మార్పీ ప్రాజెక్టుల కింద ఈ వారంలో నీటివిడుదలకు రంగం సిద్ధం చేశారు. ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లంల కింద చెరువులను నీటితో నింపడంతో బోరుబావులలో నీటిమట్టాలు పెరిగి సాగు మొదలైంది. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్టుల కింద వానాకాలం సీజన్‌లో సాగు ఉత్సాహంగా మొదలైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)



ప్రాజెక్టులకు జలకళ

నిండుకుండల్లా జలాశయాలు

- నేడు నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లు ఎత్తివేత
- మూసీ, శాలిగౌరారం కాల్వల కింద మొదలైన సాగు
- సాగర్ వరద కాల్వ (ఎల్‌ఎల్‌సీ)కి 300 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల



నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 5.20 లక్షల ఎకరాలతో పాటు ఖమ్మం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు సాగు, తాగునీటిని అందించే నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఈ సారి ముందుగానే నిండింది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో 312 టీఎంసీల సామర్థ్యానికి గాను ఇప్పటికే 295 టీఎంసీలకు నీరు చేరడంతో ఇప్పటికే కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమకాల్వ ద్వారా దిగువన పాలేరు రిజర్వాయర్ నింపుతూ, మరోవైపున నల్లగొండ జిల్లా పరిధిలోని రాజవరం, ముదిమాణిక్యం, వజీరాబాద్, ముక్కులకాల్వ మేజర్లకు నీటిని విడుదల చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా పరిధిలోని మేజర్ల కింద మరమ్మతులు కొనసాగుతుండడంతో ముక్త్యాల బ్రాంచి కాల్వ, జానపహాడ్‌మేజర్, ఇతర మేజర్లన్నింటికీ ఆగస్టు 1వ తేదీన నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. కాల్వలకు నీరు విడుదల చేయక పోయినప్పటికీ ప్రాజెక్టు నిండడంతో సీజన్‌లో నీటికి ఇబ్బంది లేని పరిస్థితి ఏర్పడడంతో రైతాంగం సాగు పనులు ముమ్మరం చేశారు. బోరుబావులు, బావుల ద్వారా నారుమళ్లు పెంచిన రైతులు నీరు అందుబాటులో ఉన్నచోట్ల వరినాట్లు వేస్తుండగా, బోర్లు, బావులు లేని రైతులు నాట్లకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మేజర్లకు, మైనర్లకు నీరిచ్చిన తక్షణమే వరినాట్లు పూర్తిచేసేలా రైతాంగం ఏర్పాట్లు చేసుకుంది.

ఏఎమ్మార్పీ కింద డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల

జిల్లాలోని దేవరకొండ, మునుగోడు, నాగార్జునసాగర్, నకిరేకల్ నియోజకవర్గాల్లో 2.20 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ఏఎమ్మార్పీ ప్రాజెక్టు కింద ఇప్పటికే ఉదయసముద్రం రిజర్వాయర్‌ని నీటితో నింపారు. ప్రస్తుతం మూడు మోటర్ల ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయ్‌కు తరలించి, అక్కడి నుంచి ప్రధాన కాల్వ ద్వారా విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచి ఈ ప్రాజెక్టు కింద ఉన్న 55 డిస్ట్రిబ్యూటరీ కాల్వల ద్వారా సాగుకు నీటిని విడుదల ప్రారంభించారు. వారబందీ పద్ధతిలో ఈడీసీలకు నీటి విడుదల కొనసాగుతుందని ప్రాజెక్టు ఈఈ సత్యనారాయణ వెల్లడించారు. అయితే రైతులు డీసీల ద్వారా ఈ ప్రాజెక్టు పరిధిలో ఉండే దాదాపు 98 చెరువులను నింపాలని కోరుతుండగా, ప్రస్తుతానికి ప్రత్యక్ష సాగుకు నీటిని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అంగడిపేట వద్ద డీ-8, 9 కాల్వలకు ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయగా, నల్లగొండ మండలంలో డీ-37 కాల్వకు ఇంజనీర్లతో కలిసి కాంగ్రెస్ నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ జూలకంటి వెంకటరెడ్డి తదితరులు నీటిని విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నానికి అన్ని డిస్ట్రిబ్యూటరీల ద్వారా ఈ ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మరోవైపున ఇప్పటికే ఏఎమ్మార్పీ ద్వారా ఉదయ సముద్రం నుంచి బ్రాహ్మణవెల్లంల రిజర్వాయర్‌కి నీటిని పంపింగ్ చేసి ఆ రిజర్వాయర్‌ని సగం మే ర నింపి, ప్రధాన కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 చెరువులను నింపారు. దీంతో నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లోని 10వేల ఎకరాలకు సాగునీటికి భరోసా దక్కిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

30 నుంచి డిండి కాల్వలకు నీటి విడుదల

జిల్లాలోని దేవరకొండ నియోజకవర్గంలోని 12,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే డిండి ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తుతోంది. దుందుభి నది నుంచి నీరు భారీగా వస్తుండడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 2.40టీఎంసీలకుగాను ఇప్పటికే 0.434 టీఎంసీలకు చేరింది. అయితే ఎగువన దుందుభితో పాటు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీరు రిజర్వాయర్‌కు వస్తుండడంతో ఈ ప్రాజెక్టు కింద కాల్వలకు నీటిని విడుదల చేయాలని ఇటీవల రైతుల సమావేశంలో నిర్ణయించినమేరకు ఈనెల 30వ తేదీ నుంచి కుడి, ఎడమకాల్వలకు నీటిని విడుదల చేయనున్నారు. ఆయకట్టులో రైతులు ఇప్పటికే బోర్ల కింద నారుమళ్లు పెంచుకుంటుండగా, కాల్వల నీరు వస్తే వెంటనే నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు.

మూసీ ఆయకట్టులో ఉధృతంగా వరినాట్లు

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 35 వేల ఎకరాలకు సాగునీరందించే మూసీ ప్రాజెక్టు..

- మిగతా 8వ పేజీలో...

ఐదు నియోజకవర్గాల్లో

నేడు మంత్రుల పర్యటన

నల్లగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటితో నిండిపోవడంతో మంగళవారం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఉదయం ప్రాజెక్టు వద్ద పూజలు నిర్వహించి క్రస్ట్‌గేట్లు ఎత్తనున్నారు. ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతున్న నేపథ్యంలో పవర్‌హౌజ్, క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు 50వేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు.

నేడు ఉమ్మడి జిల్లాలో రేషన్‌కార్డుల పంపిణీ

ఉమ్మడి జిల్లాలోని నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, నకిరేకల్, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో మంగళవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో 10 గంటలకు సాగర్‌కులో మంత్రులు ప్రాజెక్టు గేట్లు ఎత్తే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి 11.20 గంటలకు పెద్దవూరలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అ నంతరం 12.45 గంటలకు హుజూర్‌నగర్ చేరుకుంటారు. అక్కడ హుజూర్‌నగర్ ని యోజకవర్గంలోని లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారు. అనంత రం నకిరేకల్, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం లో పాల్గొని రాత్రికి తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులను

సకాలంలో పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విపత్తు నిర్వహణకు సంబంధించి ఆయా శాఖలు వారి కార్యాచరణ ప్రణాళికను వారం రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని,ఒకవేళ సమస్య పరిష్కారం కానట్లయితే సంబంధిత ఫిర్యాదుదారుడికి తెలియజేయాలని సూచించారు. డివిజన్, మండల గ్రామస్థాయిలో సైతం ఇదేవిధంగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. సోమవారం 130 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 61, రెవెన్యూ శాఖకు 69 ఫిర్యాదులు వచ్చాయి. స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

‘మధ్యాహ్న’ పెండింగ్ బిల్లులు

వెంటనే చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ

నల్లగొండ(కలెక్టరేట్), జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉంచిన బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులతో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పది నెలల నుంచి పెట్టుబడి పెడుతున్నారని అన్నారు. ఐదు నెలలుగా వేతనాలు, తొమ్మిది నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులు రాక కుటుంబాలను గడపలేక, అప్పులు తెచ్చిన చోట అవమానాలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం గుడ్లకు ఇచ్చే ధర రెండు గుడ్లకు సరిపోగా మూడో గుడ్డు పెట్టాలని అధికారులు కార్మికులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. పెట్టిన వాటికే పది నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులు ఇంకా ఎంత అప్పు చేసి పెడతారని ప్రశ్నించారు. పెండింగు వేతనాలు, బిల్లులు చెల్లించాలని కార్మికులు అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. యు కుబేర్‌లో బిల్లులు ఉన్నాయని, మాకు సంబంధం లేదని అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సక్రమంగా సాగాలంటే బకాయి వేతనాలు, బిల్లులు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని కోరారు. కార్మికులకు గ్రీన్‌ఛానల్ ద్వారా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్‌కె కరీమునిసా అధ్యక్షతన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి అనురాధ, జిల్లా నాయకులు నోముల వసంత, కొప్పు అండాలు, ఒంటెపాక సైదమ్మ, బి.శారద, దండ పుష్పలత, డి.సరోజ, గద్దపాటి లక్ష్మమ్మ, ఎల్లయ్య, లలిత, లక్ష్మమ్మ, వేముల రేవతి, పోలే నాగమ్మ మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నీటిని విడుదల చేస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య

నల్లగొండరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య అన్నారు. నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలో ఎస్‌ఎల్‌బీసీ కాల్వ నుంచి డి7 కాల్వకు సోమవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఇప్పటికే నాట్లు వేశారని, వ్యవసాయ అవసరాల నిమిత్తం డి37 కాల్వకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నల్లగొండ నియోజకవర్గం అభివృద్ధిలో అన్ని రంగాల్లో ముందుకు పోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్‌రెడ్డి, గుండ్లపల్లి మాజీ సర్పంచ్ పనస శంకర్, నాయకులు వజ్జ సత్యనారాయణ, సత్యనారాయణ, వడ్డాల జానయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ప్రీప్రైమరీ

- జిల్లాలో 35 ఎంపీపీఎస్‌ల్లో ఏర్పాట్లు
- ఆగస్టు 15 నుంచి తరగతుల ప్రారంభానికి సన్నాహాలు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ(ఎల్‌కేజీ, యూకేజీ) నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లాలోని 35 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. ప్రతీ యేటా ఆన్‌లైన్‌లో నమోదు చేసే యూడైస్ వివరాల ఆధారంగా ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు పాఠశాలల ఎంపిక జరిగింది. అదనపు తరగతి గదులు ఉండటం, జీరో ఎన్‌రోల్‌మెంట్ వంటి అంశాలే ప్రామాణికంగా ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపిక చేసినట్లు తెలిసింది. కాగా ఆగస్టు 15 నుంచి తరగతుల ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)



ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ విధానం లేకపోవడంతో ప్రైవేట్ వైపు వెళ్తున్నారన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుడుతోంది. వచ్చే విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో చేరేందుకు అర్హత కలిగిన చిన్నారులను ప్రీప్రైమరీకి ఎంపిక చేయనున్నారు. ఈ పాఠశాలలను ఆగస్టు 15వ తేదీ నుంచి లాంఛనంగా ప్రారంభించేలా జిల్లా విద్యాశాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1000 ఎంపీపీఎస్‌లలో ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించనున్నారు.

జిల్లాలో ఎంపికైన ఎంపీపీఎస్‌లు

జిల్లాలో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు 35 పాఠశాలలు ఎంపికచేశారు. ఎర్రచెరువుతండా, రావులపెంట, నర్సాపూర్, శేరిపల్లి, మల్లారెడ్డిపల్లి, కడపర్తి, తిర్మలగిరి, ఖిల్లాబజార్ దేవరకొండ, అమ్మగూడెం, ఎలికట్టె, చందంపల్లి, మర్రూర్, దొనియాల, ముత్యాలమ్మబజార్ దేవరకొండ, అమ్మనబోలు, బోయనపల్లి, ఎరగుంటపల్లి, తెట్టెకుంట, వెంకటాద్రిపాలెం, బోయగుబ్బ, ఎనుగులదొరి, పూలగూడెం, కొండమల్లేపల్లి, బోడంగిపర్తి, బుద్దారెడ్డిగూడ, తేనేపల్లి తండ, జిన్నాయి చింత, కందిమల్లివారిగూడెం, పెద్దతండ, చింతపల్లి, సోలిపురం, హరిజనవాడ ఉట్లపల్లి, ఎస్‌సీ కాలనీ అజ్మాపురం, వైజాగ్‌కాలనీ, బచ్చాపురం, కామారెడ్డిగూడెంలు ఉన్నాయి.

ఇన్‌స్ట్రక్టర్, ఆయాల నియామకం

ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ఎంపికైన పాఠశాలల్లో టీచర్, ఆయాలను నియమించనున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక ప్రక్రియ జరగనుంది. ఇంటర్ ఆపై తరగతులు చదివిన అదే గ్రామానికి చెందిన స్థానికులైన వారై ఉండాలని నిబంధన విధించారు. అదేవిధంగా ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఆపైన చదివిన వారినే అర్హులుగా పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ లోపు వీరి నియామకం జరగనున్నట్లు తెలిసింది. ఎంపికైన పాఠశాల ప్రధానోపాధ్యాయులందరితో వారం రోజుల్లో కలెక్టర్, డీఈవోల సమక్షంలో సమావేశం నిర్వహించనున్నారు. నియామకమైన టీచర్, ఆయాలపై అదే పాఠశాల హెచ్‌ఎంలకు పర్యవేక్షణాధికారం ఉండనుంది.

రూ.1.50లక్షలతో భవనాల సుందరీకరణ

ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలలో ఓ గదిని ప్రత్యేకంగా కేటాయించనున్నారు. ఆ గదికి మరమ్మతులుంటే చేయించి పూర్తిగా పిల్లలు ఇట్టే ఆకర్షించేలా రంగులు, వివిధ రకాల బొమ్మల పెయింటింగ్‌తో సుందరీకరించనున్నారు. చిన్నారుల కోసం ఫర్నీచర్ కొనుగోలు చేయనున్నారు. ఇందుకోసం ప్రతీ ప్రీ ప్రైమరీ పాఠశాలకు సుమారు రూ.1.50లక్షల చొప్పున కేటాయిస్తున్నట్లు తెలిసింది. ఈ నిధులను ఆయా పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాటైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ఖర్చు చేయనున్నారు. కాగా ప్రీప్రైమరీ తరగతుల కోసం వచ్చే చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని ఆయా పాఠశాలలు, సాయంత్రం స్నాక్స్‌ను అంగన్‌వాడీలు సమకూరుస్తారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు మా పాఠశాలను ఎంపిక చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం తీసుకువస్తున్న సంస్కరణలను యూటీఎఫ్ పక్షాన స్వాగతిస్తున్నాం. వీలైనంత మేరకు ప్రీ ప్రైమరీ విద్యార్థులను స్పెషల్ డ్రైవ్ ద్వారా చేర్పించి తరగతులను నిర్వహిస్తాం. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఉపాధ్యాయలోకం సద్వినియోగం చేసుకుంటుందని భావిస్తున్నా.

- నర్రా శేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఎంపీపీఎస్, ఎనుగులదొరి, నార్కట్‌పల్లి మండలం

క్షయ రోగులు పోషకాహారాన్ని తీసుకోవాలి

జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి కల్యాణ చక్రవర్తి



పోషణ కిట్లను అందజేస్తున్న డీటీసీవో

కనగల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): క్షయ రోగులు పోషకాహారంతో పాటు క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడితే వ్యాధి నుంచి పూర్తిగా విముక్తి పొందవచ్చని జిల్లా క్షయ నివారణ అధికారి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. కనగల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పీహెచ్‌సీ డాక్టర్ రామకృష్ణ, ఆస్పత్రి సిబ్బంది ఆర్థికసాయంతో సోమవారం క్షయ రోగులకు పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డీటీసీవో కల్యాణ్‌చక్రవర్తి హాజరై మాట్లాడుతూ క్షయవ్యాధి రోగులు తమ జీవనశైలిలో స్వల్ప మార్పులు చేసుకోవాలని సూచించారు. వ్యాధి నుంచి బయటపడేందుకు వైద్యుల సలహాలు, సూచనలు పాటించి క్షయ ముక్త్‌భారత్‌కు సహకరించాలన్నారు. మండలంలో 21మంది క్షయరోగులను గుర్తించి మందులను అందజేస్తున్నామని డాక్టర్ రామకృష్ణ తెలిపారు.

యూరియా కొరత లేదు

జేడీఏ శ్రవణ్ కుమార్



నల్లగొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌కు సంబంధించి సోమవారం సాయంత్రం నాటికి ఇంకా 8,363 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, యూరియాకు ఎలాంటి కొరత లేదని జేడీఏ పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల కోటాకు సంబంధించి మొత్తం 17,499 మెట్రిక్ టన్నులకు పైగా యూరియా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఇంకా 8,363 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. మండల కేంద్రాల్లో 6 వేల మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ గోదాములలో 1800 మెట్రిక్ టన్నులు ఉండగా మరో 700 మెట్రిక్ టన్నుల యూరియా మంగళవారం ఉదయం నాటికి జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు. మరో రెండు రోజుల్లో 2వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని వివరించారు. ఇకపోతే ఆగస్టు నెలకు సంబంధించి 20,999 మెట్రిక్ టన్నులు యూరియా రానుంది.


సెప్టెంబరు నెలకు కూడా 20,999 మెట్రిక్ టన్నులు ఆ నెలలో కేటాయించినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద రైతులు ముందస్తుగానే జూన్, జూలై మాసంలోనే 7వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారని తెలిపారు. జిల్లాలో డీఏపీ 1026 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 1917 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకెఎస్ 18,844 మెట్రిక్ టన్నులు, ఎస్‌ఎస్‌పీ 1383 మెట్రిక్ టన్నులు, కంపోస్టు ఎరువులు 103 మెట్రిక్ టన్నులు, ఎఫ్‌వోఎం 53 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని జేడీఏ శ్రవణ్ కుమార్ వివరించారు. రైతులకు అవసరాలకు అనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు ఎంజీయూకు తెలంగాణ విద్యా కమిషన్ రాక

నల్లగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ఆచార్య విశ్వేశర్‌రావు, డాక్టర్ చారుకొండ వెంకటేష్, కె.జోత్స్న, శివారెడ్డి మంగళవారం ఎంజీయూను సందర్శించనున్నట్లు రిజిస్ట్రార్ అల్వాల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీ యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో 10.30 గంటలకు విద్యా అంశాలపై చర్చించనున్నారు. ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ తొలిప్రసంగంతో కార్యక్రమాలు మొదలవుతాయని పేర్కొన్నారు. సెమినార్‌కు విద్యార్థి సంఘాల నాయకులు, ప్రిన్సిపాల్స్, అవుట్‌సోర్సింగ్, జర్నలిస్టులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కొండమల్లేపల్లి మండలం చింతచెట్టుతండా, వద్యతండా, జేత్యతండా, పుల్‌సింగ్‌తండాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన నిధులతో శంకుస్థాపనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నాడని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో కొండమల్లేపల్లి మండల మాజీ అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, నాయకులు రమావత్ దస్రునాయక్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, దేవేందర్, బద్రునాయక్, తులసీరాం, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచిపడి గీత కార్మికుడికి గాయాలు



చిట్యాలరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు అనంతుల మల్లేశం గౌడ్ రోజు మాదిరిగా కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి కింద పడడంతో గాయాలయ్యాయి. మల్లేశంగౌడ్‌ను కుటుంబ సభ్యులు చికిత్స కోసం నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించారు.

పిచ్చికుక్కల దాడిలో ..

భూదాన్‌పోచంపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్కల దాడిలో బాలుడు గాయపడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని వంకమామిడి గ్రామంలో సోమవారం జరిగింది. దాసరి శైలజ బోనాల పండుగకు తల్లిగారింటికి వచ్చింది. ఆమె కుమారుడు చింటు వీధిలోని పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా రెండు పిచ్చి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దాడిచేస్తున్న కుక్కలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నించిన తల్లిదండ్రులపై కూడా కుక్కలు దాడికి యత్నించాయి. రాళ్లతో కొట్టి బెదిరించడంతో కుక్కలు పారిపోయాయి. గాయపడిన బాలుడు చింటూను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు.



గాయపడిన చింటు

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని సైతాపురం జాతీయ రహదారిపై పశువులను తరలిస్తున్న లారీని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం నుంచి హైదరాబాద్ బహదూర్‌పూర్‌కు లారీలో 35గోవులను అక్రమంగా తరలిస్తుండగా సైతాపురం వద్ద పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. డ్రైవర్ మహ్మద్ మొయినొద్దిన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



వాహనంలో తరలిస్తున్న పశువులు

దొంగల ముఠా అరెస్టు

చౌటుప్పల్‌రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో కారులో నుంచి రూ.4లక్షల నగదును అపహరించిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన వేముల పుల్లారావు, జగదీశ్‌బాబు, కర్నూలుకు చెందిన టర్కాల సునీల్‌కుమార్ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 26న చౌటుప్పల్ మండల కేంద్రంలోని చిన్నకొండూరులో వీరగందం శ్రీనివాస్‌కు చెందిన కారులో నుంచి రూ.4లక్షల నగదును అపహరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ధర్మోజిగూడెం జాతీయ రహదారిపై పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా వాహనంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.4లక్షల నగదు, 5 గ్రాముల బంగారు బిస్కెటు, మొబైల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

నిద్రలోనే మృత్యు ఒడిలోకి.

• భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

త్రిపురారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నిద్రలోనే భర్త మృతిచెందడంతో అనుమానంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని కామారెడ్డిగూడెంలో సోమవారం జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన నాగయ్య(50) కన్నెకల్‌లోని వైన్‌షాప్‌లో పనిచేస్తుండేవాడు. ఆదివారం నాగయ్య భార్య చెర్వుగట్టు దేవస్థానానికి దర్శనానికి వెళ్లింది. వైన్‌షాప్‌లో విధులు ముగించుకొని నాగయ్య ఇంటికి వచ్చి ఒంటరిగా నిద్రించాడు. సోమవారం ఉదయం 9గంటలకు వైన్‌షాప్‌నకు సంబంధించిన యజమాని ఫోన్ చేసినప్పటికీ ఫోన్ ఎత్తలేదు. అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు ఇంట్లోకి వెళ్లి చూడగా నాగయ్య అపస్మారకస్థితిలో మంచంపై ఉన్నాడు. వెంటనే గ్రామంలోని ఆర్ఎంపీని పిలిపించి పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించాడు. నాగయ్య భార్యకు విషయం తెలిపారు. నాగయ్య భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నాగయ్య (ఫైల్)

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు



వెంకటేష్(ఫైల్)

మోత్కూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన కుంచపు వెంకటేష్(38) ఈ నెల 27 సాయంత్రం నుంచి కనిపించడం లేదని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేష్ సుమారు నెలన్నరగా కూలి పనులకు వెళ్లడం లేదు. ఇలా అయితే ఎలా బతుకుతామని భార్య విజయ భర్తను ప్రశ్నించింది. అప్పటి నుంచి వెంకటేష్ భార్యతో మాట్లాడటం లేదు. ఈ నెల 27న ఉదయం ఆమె కూలి పనికి వెళ్తూ భర్తను కూడా పనికి రావాలని పిలిచింది. పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. పని ముగించుకొని సాయంత్రం వచ్చిన విజయకు వెంకటేష్ ఇంట్లో కనిపించలేదు. కుమారుడిని అడగగా సాయంత్రం ఆరు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడని చెప్పాడు. రాత్రంతా వెతికినా కనిపించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

అడ్డగూడూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చిర్రగూడూరు బిక్కేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్.ఐ వెంకట్‌రెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం... గుండాల మండలంలోని బండకొత్తపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్, యాకన్న బొలెరో వాహనంలో అనుమతులు లేకుండా చుట్టు పక్క గ్రామాలకు ఇసుక తరలిస్తున్నారు. సమాచారం మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించి సుమోటాగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సెవన్ ఆర్ హోటల్‌లో మునిసిపల్ అధికారుల తనిఖీ

సూర్యాపేటరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని రాయినిగూడెం సమీపంలో ఉన్న సెవన్ ఆర్ హోటల్‌పై మునిసిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి సోమవారం తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో పారిశుధ్యం, నాణ్యత ప్రమాణాలు, నిల్వ ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించే బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని విస్మరించి లాభాల కోసం గడువు దాటిన పదార్థాలు వాడితే ఆహార భద్రతా చట్టాల కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని లోపాలను గుర్తించి హోటల్ యాజమాన్యాన్ని మందలించారు.



సెవెన్ ఆర్ హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు

అభిరుచితో సినిమాల వైపు

• పేపర్‌బాయ్ నుంచి పాన్ ఇండియా సినిమా అసోసియేట్ డైరెక్టర్ స్థాయికి అరవింద్ • ఫొటోగ్రఫీ, సాహిత్యంలోనూ ప్రావీణ్యం

విద్యార్థి దశ నుంచే భిన్నమైన ఆలోచనలు, శాస్త్రీయంగా ఉండాలని మనస్తత్వం అతడిది. అదే ధోరణిలో సామాజిక అంశాలను ఇతివృత్తంగా చేసుకుని కథలు, కవిత్వాలు, సాహిత్యాన్ని వెలువరించారు. ప్రకృతి రమణీయతను ఫ్రేమ్‌లో బంధించేందుకు కెమెరా అందుకున్నారు. చిరుగాలికి తలలూపే గడ్డిపరకలను మొదలు తూనీగలను, ప్రకృతి పూల రంగులను చిత్రాలలో చిత్తరువులుగా చేశారు. ఆ ఆసక్తి సినీరంగంవైపు మళ్లించింది. అలా సినీరంగంలో అసోసియేట్ దర్శకుడిని చేసింది. అతడే కుబేర సినిమా విజయంలో పాలుపంచుకున్న నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని మేడారం గ్రామానికి చెందిన అరవింద్.

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ)

అరవింద్ తన తల్లిదండ్రులు అంజమ్మ, వెంకటయ్య పేర్లలోని మొదటి అక్షరాలను ఇంటిపేరుగా మార్చుకున్నారు. హాలియాలో స్కూల్, ఇంటర్, మిర్యాలగూడలో డిగ్రీ పూర్తిచేశారు. అక్కడే హాస్టల్‌లో ఉంటూ కొంతకాలం పేపర్‌బాయ్‌గా, రైస్‌మిల్లు కార్మికుడిగా రాత్రివేళ పనిచేస్తూ సొంతఖర్చులను సమకూర్చుకుంటూ చదువు సాగించారు. మిర్యాలగూడలో ఏర్పడిన వ్యక్తుల పరిచయాలు, గ్రంథాలయంలోని నవలలు, పుస్తకాలు చదవడంతో వచ్చిన చైతన్యంతో సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సాహిత్యం, సమకాలీన రాజకీయాలపై అవగాహన పెంచుకున్నారు.

సాహిత్య 'ఆలోచన'

యూనివర్శిటీలో మాస్ కమ్యూనికేషన్ చదువుతూ వార, మాసపత్రికలు నడిపారు. సామాజిక స్పృహ, సాహిత్య అంశాలను సృజిస్తూ కవితలు, వ్యాసాలు రాశారు. నాన్నపై రాసిన కవిత చాలా ప్రశంసలు పొందింది. ఇంగ్లీష్, హిందీ, మరాఠి, తమిళ, కన్నడలోకి అనువాదమైంది. తాను చదివి ఉత్తేజాన్ని, జ్ఞానాన్ని పొందిన పుస్తకాలను నలుగురితో చర్చించడం, చదివించడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుందని భావించి యూనివర్సిటీలో, ఇతర ప్రాంతాల్లో స్టడీ సర్కిల్స్ ఏర్పాటుచేసి సాహిత్యం, కళలు, సంస్కృతిపై సదస్సులు నిర్వహించారు. 'ఆలోచన', తూనీగ సంస్థల ద్వారా గ్రామీణ, పట్టణ విద్యార్థులకు చిన్నచిన్న కథలు, దేశభక్తుల జీవిత చరిత్రలను పరిచయం చేశారు.

ప్రయాణాలతో ప్రాపంచిక జ్ఞానం

కన్నడ నవల 'మరలా సేద్యానికి' చదివి కర్ణాటక రాష్ట్రంలోని కుందాపుర గ్రామం వెళ్లి అక్కడి నుంచి దక్షిణ భారతయాత్రను ప్రారంభించారు. కన్నడ, మళయాళం, తమిళ్ సాహిత్యం చదువుతూ అనేకప్రాంతాల్లో పర్యటించారు. ప్రకృతి సోయగాలకు, జీవనవైవిధ్యాన్ని తన కెమెరాలో బంధిస్తూ ఫొటోగ్రఫీపై అభిరుచి ఏర్పర్చుకున్నారు. అలా తీసిన ఫొటోలతో సోలో ఎగ్జిబిషన్ నిర్వహించారు.2024లో అట్లాంటాలో ఆటా ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్‌లో ఫొటోలను ప్రదర్శించారు.

దర్శకుడు అనుదీప్ కేవీ పరిచయంతో

సాహిత్యాన్ని పరిచయం చేసే క్రమంలో జాతిరత్నాలు సినిమా దర్శకుడు అనుదీప్ పరిచయం ఏర్పడింది. ఆ క్రమంలో సినీ కథలను చర్చిస్తూ, రాస్తుండటంతో సినిమా రంగంలోకి ప్రవేశించారు. అనుదీప్ డైరెక్ట్ చేసిన ప్రిన్స్ సినిమాకు రచనా విభాగంలో పనిచేసి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకున్నారు అరవింద్. కుబేర షూటింగ్‌కు ముందు శేఖర్ కమ్ముల పిలిచి తన టీం లోకి తీసుకున్నారు. ముంబాయిలో సినిమా లోకేషన్లను వెతికే పనిఅప్పగించడంతో 230 ప్రాంతాలను మార్క్‌చేసి ఇవ్వడంతో డైరెక్టర్ విజన్‌కి తగినట్లుగా ఉన్నట్లు టీంసభ్యులు గుర్తించారు. టీంలో చురుకుగా పని చేస్తూ చీఫ్ అసోసియేట్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు అరవింద్.



కుబేర షూటింగ్‌లో హీరోయిన్ రష్మికకు సీన్ గురించి వివరిస్తున్న అరవింద్



రైటర్‌గా నిలవాలన్నదే ధ్యేయం

భవిష్యత్‌లో రైటర్‌గా నిలవాలన్నదే లక్ష్యం. ప్రస్తుతం కుబేర విజయాన్ని ఆస్వాదిస్తున్నా. ఆ సినిమా నిర్మాణ సమయంలో మాఆర్ట్ టీం 60-70 గంటలు నిర్విరామంగా పనిచేసేది. దర్శకుడు శేఖర్ కమ్ముల వ్యక్తి కాదు పాఠశాల. సృజనను నేర్చుకోవడానికి, అర్థం చేసుకోవడానికి దోహదపడే వ్యక్తిత్వం.



• అరవింద్ ఏవీ, సినీ అసోసియేట్ డైరెక్టర్

నాలుగు రోజుల్లో వివాహం.. అంతలోనే విషాదం

• యువకుడి బలవన్మరణం • పెళ్లి భాజా మోగాల్సిన ఇంట్లో.. చావు డప్పు • హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న నల్లగొండ జిల్లా వాసి

చింతపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంట్లో నాలుగు రోజుల్లో పెళ్లి భాజా మోగాల్సి ఉంది. బంధువులందరికీ శుభలేఖలు చేరాయి. ఇరు కుటుంబాల సభ్యులు పెళ్లి వేడుకల్లో నిమగ్నమయ్యారు. పెళ్లి భాజాలతో పాటు ఫంక్షన్‌హాల్ మాట్లాడారు. ఆహ్వానాలన్నీ పూర్తయ్యాయి. ఇంతలోనే విషాదం నెలకొంది. పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో స్వగ్రామం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని పీకే. మల్లేపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబసభ్యుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీ.కే.మల్లిపల్లి గ్రామానికి చెందిన ముచ్చర్ల నరసింహ, జంగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. మొదటి కుమారుడికి వివాహంకాగా, రెండో కుమారుడు ముచ్చర్ల అరుణ్(32) కొంత కాలంగా రంగారెడ్డి జిల్లా బీఎన్.రెడ్డినగర్(హైదరాబాద్)లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో స్థిరాస్తి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అరుణ్‌కు రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన యువతితో ఈ నెల 30వ తేదీన వివాహం జరగాల్సి ఉంది. హైదరాబాద్‌లో తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఈ నెల 26వ తేదీ రాత్రి ఎవరూ లేని సమయంలో అరుణ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఆదివారం హైదరాబాద్‌లోనే కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కొద్దిరోజుల్లో పెళ్లి పీటలపై కూర్చోవాల్సిన అరుణ్ విగతజీవిగా మారాడని తెలుసుకున్న గ్రామస్థులు సైతం కన్నీరుమున్నీరయ్యారు.



అరుణ్(ఫైల్)

తల్లికి భుక్తం ఇవ్వనందుకు కుమారులపై కేసు

మునగాల, జూలై 28(ఆంధ్రజ్యోతి): కన్న తల్లికి భుక్తం ఇవ్వని ఇద్దరు కుమారులపై సూర్యాపేట జిల్లా పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలకేంద్రానికి చెందిన సుంకరి భద్రమ్మ, సైదులు దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త సైదులు 10 సంవత్సరాల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి భద్రమ్మ కూలి పని చేసుకుంటూ జీవిస్తోంది. తనకు కుమారులు భుక్తం ఇవ్వాలని కోరుతూ భద్రమ్మ ఐదు నెలల క్రితం కోదాడ ఆర్డీవో సూర్యనారాయణను ఆశ్రయించింది. ఒక్కో కుమారుడు నెలకు రూ.2వేలు ఇవ్వాలని ఆర్డీవో ఆదేశించారు. దీంతో చిన్న కుమారుడు దివ్యాంగులైన నాగయ్య ఒక్కడే తల్లిని సాకుతున్నాడు. ఇద్దరు కుమారులు సుంకరి వెంకన్న, అంజయ్య ఆర్డీవో ఆదేశాలను భేఖాతార్ చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అధికారులు ఆదేశించినా...

భద్రమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. తనను నెలకు ఒకరు చూసుకోవాలని కోరింది. దీంతో చిన్న కుమారుడు నాగయ్య ఒక్కడే ముందుకు వచ్చాడు. పెద్ద, రెండో కుమారులు ఇద్దరు తరస్కరించారు. ఒక కుమారుడు తండ్రి పేరుతో ఉన్న ఇంటిని కూడా తన పేరుపై మార్చుకున్నాడు. భర్త పేరుతో ఉన్న ఇల్లు తన పేరు మీద మార్చాలని భద్రమ్మ అధికారుల చుట్టూ తిరుగుతోంది. ఆమె ఆర్డీవోను కూడా ఆశ్రయించింది. తల్లికి ఒక్కో కుమారుడు ప్రతి నెలా రూ.2వేలు ఇవ్వాలని ఆదేశించారు. ఆ ఆదేశాలను ఇద్దరు కుమారులు భేఖతార్ చేశారు.

కనీ, పెద్ద చేసినా బుక్కెడు బువ్వ పెట్టలేకపోతున్నారు : భద్రమ్మ

నా భర్త, నేనే కూలి పని చేస్తూ అందరినీ పెంచి పెద్ద చేసి, విద్యబుద్దులు నేర్పి వారికి పెళ్లిళ్లు చేశాం. పది సంవత్సరాల క్రితం నా భర్త మృతిచెందారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూలి పని చేసుకుంటూ కాలం వెళ్ల దీశాను. వృద్ధాప్యంలో పని చేయలేక పోతున్నాను. ఇంటి స్థలం పంచి ఇచ్చాను. పెద్ద కుమారుడు క్షౌర వృత్తి, రెండో కుమారుడు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వారు నన్ను పట్టించుకోవడం లేదు.

పోలీసు పహారాలో సెల్‌టవర్ నిర్మాణం

హుజూర్‌నగర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని 13, 14, 15 వార్డుల పరిధిలోని తిలక్‌నగర్, ఎరుకల బజార్, మట్టపల్లి బైపాస్ రోడ్డులో ఇటీవల ఓ సంస్థకు చెందిన సెల్‌టవర్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. పట్టణ వాసులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. రేడియేషన్ వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతారని, ఇళ్ల సమీపంలో సెల్ టవర్ నిర్మించొద్దని ఆందోళనలు చేశారు. వారంరోజుల క్రితం సంస్థకు చెందిన ప్రతినిధులు టవర్ నిర్మాణానికి ప్రయత్నించగా కాలనీలకు చెందినవారు పైపులను ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పట్టణంలో సుమారు వందమంది పోలీసులు సెల్‌టవర్ నిర్మాణం చేసేందుకు బందోబస్త్‌కు రావడంతో గ్రామస్థులు నిరసన వ్యక్తంచేశారు. పోలీసులతో యువకులు వాగ్వాదానికి దిగారు. ఏఎస్ఐ బలరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా పోలీసులతో కూడా బందోబస్తు నిర్వహించారు. పోలీసులు తిలక్‌నగర్, చిన్నముత్యాలమ్మ దేవాలయం సెంటర్, ఎరుకల బజార్, ఎస్సీ కాలనీలకు చెందిన ప్రజలను దిగ్బంధం చేశారు. నాలుగు వైపుల ఆందోళనకారులను రానీయకుండా పహారా కాశారు. ఈ సమయంలో కొంత టవర్ నిర్మాణ పనులు చేపట్టారు. యువకులు, పలు పార్టీల నాయకులు, దళిత సంఘాలు, బీసీ సంఘాల నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సెల్‌టవర్‌ను రద్దుచేయాలని గతంలో కలెక్టర్, ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్లకు దళిత, బీసీ సంఘాల నాయకులు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసుల పహారా నడుమ సెల్‌టవర్ నిర్మాణ పనులు చేపట్టారు. స్థల యజమాని సెల్‌టవర్ నిర్మాణానికి అద్దెకు ఇవ్వడం పట్ల పట్టణ వాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పలువురు యువకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోలపూడి దయాకర్, దగ్గుపాటి బాబూరావు, కల్యాణ్, అల్వాల నరేష్, వసంత్, శ్రీను, వెంకన్న, రాము పాల్గొన్నారు.



యువకులతో మాట్లాడుతున్న పోలీసులు

మోడల్ స్కూల్‌లో నిధుల అవకతవకలపై విచారణ

మర్రిగూడ, జూలై28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మోడల్ పాఠశాలకు మంజూరైన అభివృద్ధి నిధులపై జరిగిన అవకతవకలు అక్రమాలపై తెలంగాణ రాష్ట్ర మోడల్ పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ సోమవారం విచారణ నిర్వహించారు. ఖర్చులకు సంబంధించిన వివరాలపై స్పష్టత లేకపోవడంతో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పై అసహనం వ్యక్తం చేశారు. మర్రిగూడలో ఉన్న ఆదర్శ పాఠశాలకు అభివృద్ధి కోసం మంజూరైన నిధుల పై సమగ్ర విచారణ నిర్వహించి ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ అనంత రాజుగౌడ్ తెలంగాణ రాష్ట్ర మోడల్ పాఠశాల డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు ఫిర్యాదు గతంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన రాష్ట్ర మోడల్ పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్‌కు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం విచారణ నిర్వహించారు. అంతకుముందు ఆదర్శపాఠశాలకు సంబంధించిన రికార్డును పరిశీలించి, వివిధ శాఖల ద్వారా అభివృద్ధి కోసం మంజూరైన రూ.55 లక్షల నిధుల వివరాలను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శివస్వరూపరాణిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు చూపించాలని అడగగా అవి ఆడిట్ జరుగుతుందని, ఆడిట్ కోసం జిల్లా ఆడిట్ అధికారులు తీసుకెళ్లారని రికార్డులు జిల్లా ఎమ్మార్సీలోనే ఉన్నాయని, రెండు రోజుల్లో రికార్డులు తీసుకొచ్చి వివరాలు ఇస్తానని ప్రిన్సిపాల్ విచారణకు వచ్చిన అధికారులకు తెలిపారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం విధుల నిర్వాహణ పనితీరుపై విచారణ అధికారి అసంతృప్తి వ్యక్తం పరిచారు. విచారణ నివేదికను రాష్ట్ర మోడల్ పాఠశాల ఉన్నత అధికారులకు పంపనున్నట్లు విచారణ అధికారి తెలిపారు. ఆదర్శ పాఠశాల అభివృద్ధి కోసం మంజూరైన నిధుల్లో అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని మాజీ ఎంపీపీ అనంతరాజుగౌడ్ తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్‌ను కోరారు.



వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర మెడల్ పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్

గంజాయి విక్రయిస్తున్న యువకుడు అరెస్ట్

పెన్‌పహాడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ కస్తాల గోపిక్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన సాయిగణేష్, శాంతినగర్‌కు చెందిన పవన్, అమరగాని లోకేష్ గంజాయికి అలవాటు పడ్డారు. ఇతరులకు గంజాయి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు ప్రాంతానికి వెళ్లి అక్కడ గంజాయి కొనుగోలు చేశారు. ఆ గంజాయిని పెన్‌పహాడ్ ప్రాంతంలో విక్రయించేందుకు బైక్‌పై వస్తుండగా అనంతారం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు అనుమానించి బైక్‌ను ఆపి వివరాలు అడగడంతో సమాధానం సరిగా చెప్పలేదు. వారిని విచారిస్తున్న క్రమంలో పవన్, లోకేష్ బైక్‌పై నుంచి దూకి పరారయ్యారు. సాయిగణేష్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి లభించింది. పారిపోయిన లోకేష్, పవన్‌లతో పాటు సాయిగణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ మానవ హక్కుల కమిషన్ బహిరంగ విచారణ

హైదరాబాద్ సిటీ, జూలై28(ఆంధ్రజ్యోతి): 'చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కుమారుడు అనుమానాస్పద మృతి చెందితే, పోలీసులు రోడ్డు ప్రమాదంగా కేసు నమోదు చేశారంటూ ఓ తల్లి ఫిర్యాదు. ఆస్తి తగాదాలలో సొంత చెల్లెళ్లే అన్నను పొట్టన పెట్టుకున్నారంటూ మృతుడి భార్య ఆవేదన. అర్థాంతరంగా ఉద్యోగంలో నుంచి తనను తొలగించారని ఓ యువకుడి రోదన. ఇలా ఒకటా, రెండా.. భూకబ్జాలు, ఆస్తి తగాదాలు, లైంగిక దాడులు తదితర మానవ హక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ) జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం వేదికగా సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్-1 లో ఎన్‌హెచ్‌ఆర్సీ చైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్-1లో 36 కేసులు విచారించారు. కమిషన్ సభ్యులు సాయని విజయభారతి, జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ -2లో మొత్తం 52కేసులు విచారణకు వచ్చినట్లు సమాచారం. ఫుల్ బెంచ్ ఆధ్వర్యం లోనూ జైళ్లలోని పరిస్థితులు, బాధితులకు తగిన సమయంలో పరిహారం అందకపోవడం, కొన్ని కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులపై సాయంత్రం వరకు విచారణ కొనసాగింది. తెలంగాణ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రవి గుప్తా, లాఅండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ హాజరయ్యారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేతేపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గల ఓ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ లీకేజీతో సోమవారం మండలంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేతేపల్లి సబ్‌స్టేషన్‌లోని-2 8ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో కొత్తపేట, గుడివాడ, కాసనగోడు, బొప్పారం, ఇప్పలగూడెం, కొర్లపహాడ్, ఇనుపాముల, కొండకిందిగూడెం, కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ క్రమంలో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకదానికి ఆయిల్ సీక్కు దెబ్బతినడంతో సోమవారం ఆయిల్ లీకేజీ చోటుచేసుకుంది. దీంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొగలు వెలువడ్డాయి. సిబ్బంది నాలుగు గంటల పాటు శ్రమించి పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆయిల్ సీలువేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

‘స్థానిక’ ఎన్నికలను వెంటనే నిర్వహించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదన్నారు. పాలకులు, ప్రతిపక్ష పార్టీల తీరు ప్రజలు అసహ్యాయించుకునే విధంగా ఉందన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేసేందుకు షెడ్యూల్ ప్రకటించాలన్నారు. నిరంతరంగా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు రుణాలు, రుణమాఫీ చేపట్టాలన్నారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ ప్రణాళికను ప్రకటించి, జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, నాయకులు పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ హాషం తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ

నల్లగొండ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోర్సులను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని సెట్విన్ శిక్షణ సంస్థ కో ఆర్డినేటర్ ఎం. సరిత అన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఎడ్యుకేషన్ కోర్సులు, కంప్యూటర్ బేసిక్స్ డీటీపీ, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మొబైల్ రిపేరింగ్, అదేవిధంగా విద్యార్థినీలకు, యువతులకు కంప్యూటర్, బ్యూటీషియన్, డిప్లమా ఇన్ ఫ్యాషన్ డిజైనింగ్, టెక్స్‌టైల్స్ డిజైనింగ్, కుట్టు మిషన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 50శాతం ఫీజు రాయితీతో విద్యార్థులకు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. వివిధ ఉపాధి కోర్సులకు సంబంధించి పట్టణంలోని దేవరకొండ రోడ్డులోని ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పక్కనగల సెట్విన్ కేంద్రంలో ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సుమారు 27రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్వయం ఉపాధి కోర్సుల్లో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాల కోసం సెల్: 9705041789, 08682281101లలో సంప్రదించాలని సూచించారు.

కబడ్డీ పోటీల్లో శ్రీజన్‌కు బెస్ట్ డిఫెండర్ అవార్డు



నార్కట్‌పల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని శ్రీ విద్యాపీఠ్ రెసిడెన్షియల్ పాఠశాలలో 10 వతరగతి చదువుతున్న కన్నెబోయిన శ్రీజన్ అనే విద్యార్థి కబడ్డీ పోటీల్లో బెస్ట్ డిఫెండర్ అవార్డు గెలుచుకున్నాడు. ఈ నెల 25 నుంచి 27 వరకు కరీంనగర్ జిల్లా వివేకానంద సీబీఎస్‌సీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన ఆంధ్ర తెలంగాణా క్లస్టర్-7 కబడ్డీ పోటీల్లో విద్యాపీఠ్ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి బాలుర అండర్-17 పోటీల్లో పాల్గొన్న శ్రీజన్ ప్రతిభ కనబర్చి బెస్ట్ డిఫెండర్ అవార్డు అందుకున్నాడు. విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, కోచ్‌లు అభినందించారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం

నల్లగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలు క్రీడల్లో రాణించడం అభినందనీయమని నల్లగొండ అదనపు ఎస్పీ రమేష్, నల్లగొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, నల్లగొండ మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్‌లు అన్నారు. క్రీడాప్రాధికారిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల 4వ సబ్ జూనియర్ బాలబాలికలకు బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నల్లగొండకు చెందిన పి.సిద్దార్థ, సీహెచ్ నిపుణ్ బంగారు, డి.దేవి, ఎం.అపూరూప్ రజిత పతకాలు సాధించారు. అదేవిధంగా తమిళనాడులో జరిగిన అండర్-15 నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లోక్రీడా పోటీల్లో నల్లగొండకు చెందిన వణమాల శశాంక్ పాల్గొని గెలుపొందారు. అదేవిధంగా వరంగల్‌లో జరిగిన అండర్- 17 రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందారు. చైనాలో నిర్వహించిన అండర్ - 15 ఆసియా బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభకనబర్చారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులు డీవైఎస్‌వో అక్బర్‌అలీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రమేష్, మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్‌లను కలిశారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోకు బకాయిల షాక్

● సూర్యాపేట జిల్లాలో రూ.12,115 కోట్ల విద్యుత్ బకాయిలు



సూర్యాపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్

(ఆంధ్రజ్యోతి-భానుపురి) జిల్లాలో విద్యుత్ బిల్లులు రూ.వేల కోట్లలో పేరుకున్నాయి. విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. విద్యుత్ లేనిదే ఏపనీ అయ్యేలా లేదు. అన్ని కేటగిరిల్లో విద్యుత్‌ను చోరీ చేస్తుండడం, పెద్దపెద్ద బకాయిలు వసూలు చేయడంలో సిబ్బంది అలసత్వం వహించడం, తీగలకు తగిలించి అక్రమంగా విద్యుత్ వినియోగం చేయడం ద్వారా రూ.కోట్లు బకాయి పడ్డాయి. కొన్ని కాలనీల్లో అసలు బిల్లులు చెల్లించనందున బకాయిలు మరింత పెరిగాయి. పెండింగ్ బిల్లులు వసూలు చేయడానికి ప్రత్యేకంగా అధికారులు దృష్టి సారించినా ఆశించిన ఫలితాలు రావడం లేదని తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారు విద్యుత్ బిల్లులు మాఫీ అవుతాయని, 2023 కంటే ముందు(గృహజ్యోతి రాక ముందు) బిల్లులు చెల్లించకపోవడం, బీసీలకు ఉచితంగా అప్పటి ప్రభుత్వం ప్రకటించిన బకాయిలు ఇవ్వకపోవడం, గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలు సైతం చెల్లించపోవడంతో బకాయిలు రూ.కోట్లలో పేరుకున్నాయి.

జిల్లాలో అన్ని కేటగిరిల్లో విద్యుత్ సర్వీసులు 5,45,496 ఉన్నాయి. అన్నింట్లో కలిపి రూ.12,115 కోట్ల బకాయిలు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. విద్యుత్ రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందిని వసూలు చేయాలని చెప్పినా పాతబకాయిలు చెల్లించడం లేదని చెబుతున్నారు. అవి మొదటి నుంచి మొండి బకాయిలుగానే మిగిలిపోతున్నాయని అధికారులు అంటున్నారు. జిల్లాలో కేటగిరి-1లో 3,31,619 గృహ సర్వీసులు ఉన్నాయి. ఈ విభాగంలో జూన్ నెల వరకు రూ.1,002 కోట్లు బకాయిలు ఉన్నాయి. కేటగిరి-2లో 44,350 సర్వీసులు(దుకాణాలు ఉండగా రూ.1371 కోట్లు, కేటగిరి-3లో 3,103 విద్యుత్ సర్వీసులు ఉండగా రూ.120 కోట్లు, కేటగిరి-4లో చిన్నతరహా పరిశ్రమల సర్వీసులు 240 ఉండగా రూ.27.47 కోట్ల బకాయిలు ఉన్నాయి. కేటగిరి-5లో వ్యవసాయ సర్వీసులు 1,56,870 ఉండగా రూ.422.76 కోట్లు బకాయిలు ఉన్నాయి. కేటగిరి-6 ఏలో 7,071 సర్వీసులు ఉండగా రూ.9,126.08 కోట్లు బకాయిలు ఉన్నాయి. కేటగిరి- 7లో 2,033 సర్వీసులు ఉండగా రూ.42.49 కోట్లు, కేటగిరి-8లో 183 సర్వీసులు ఉండగా రూ.2.82 కోట్లు బకాయిలు ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

అత్యధికంగా పంచాయతీలవే...

కేటగిరిలో-6ఏలో గ్రామపంచాయతీల బోరు బిల్లులు, విద్యుత్ దీపాల బిల్లులు, గ్రామపంచాయతీల బిల్లుల కింద రూ.9,126 కోట్లు బకాయి ఉన్నాయి. అప్పటి అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిడితో సక్రమంగా వసూలు చేయలేకపోయారు. దీంతో వేల కోట్లకు బకాయిలు చేరాయి.

బకాయిలు వసూలు చేస్తాం



విద్యుత్ బకాయిలు వసూలు చేస్తాం. రూ.కోట్లలో బకాయిలు నిజమే. గృహజ్యోతి కంటే ముందు బకాయిలు ఎక్కువగా ఉన్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తూనే ఉన్నాం. మండలాల ఏఈలను, లైన్‌మన్లను వసూలు చేయాలని చెబుతున్నాం. ప్రత్యేకంగా సమీక్ష సమావేశాలు సైతం నిర్వహిస్తున్నాం.

ఫ్రాంక్లిన్, ఎస్ఈ, విద్యుత్ శాఖ సూర్యాపేట

18 రకాలు.. మెరుగైన ఫలితాలు

» ఆధునిక సాగుతో రాణిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాసరావు » సేంద్రియ పద్ధతిలో 18 రకాల డ్రాగన్ మొక్కలు సాగు

డ్రాగన్ పంట సిరులు కురిపిస్తోంది. ఒక్కసారి మొక్కలు నాటితే 25 ఏళ్లకు పైగా దిగుబడులు వస్తాయి. మొక్కను కాపాడితే 30ఏళ్ల వరకూ దిగుబడి ఇస్తుందని రైతులు పేర్కొంటున్నారు. సాధారణంగా వరి పండించే సాగర్ ఆయకట్టు ప్రాంతంలో అనేక పోషక విలువలు కలిగిన ఈ డ్రాగన్ పంటను సంపూర్ణ సేంద్రియ పద్ధతిలో పండించడం విశేషం. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన శ్రీశ్రీ అలియాస్ డాక్టర్ పారుపల్లి శ్రీనివాసరావు సౌదీ అరేబియాలో 16 సంవత్సరా లపాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. వ్యవసాయంపై మక్కువతో మూడేళ్లుగా స్వగ్రామంలో డ్రాగన్ ఫ్రూట్‌సాగు చేస్తు న్నారు. - ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్



హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురంలో సేంద్రీయ పద్ధతిలో డ్రాగన్ పంట సాగు, డ్రాగన్ పంటను చూపుతున్న రైతు శ్రీశ్రీ

హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురంలో శ్రీనివాసరావుకు సుమారు 20ఎకరాలకు పైగా భూమి ఉంది. అందులో 5 ఎకరాల మామిడి తోట. 10 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, మిగిలిన 5 ఎకరాలలో ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ పంట సాగుకు శ్రీకారం చుట్టారు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో మూడు సంవత్సరాలుగా డ్రాగన్ పంట సాగు చేస్తున్నారు. శ్రీలంక, వియత్నాం, సింగపూర్ దేశాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుండి డ్రాగన్ మొక్కలు తీసుకొచ్చి నాటారు. ఐదు ఎకరాల్లో సుమారు రూ.25లక్షల ఖర్చుతో మూడేళ్ల క్రితం మొక్కలు నాటగా అవి పెరిగి పెద్దయ్యాయి. సుమారు 18రకాల డ్రాగన్ మొక్కలు నాటి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. డ్రాగన్‌లో తైవాన్ పింక్, లెమన్ జంబో, అమెరికన్ బ్యూటీ, నీఆమ్‌రెడ్డి, మెకిన్‌రెడ్, వియత్నాం మిస్‌నైట్, ఐఎస్ఐఎస్ వైట్, శ్రీలంక రెడ్, అమెజాన్ యెల్లో, జెయిన్‌పింక్, కాస్టారికాసన్‌సెట్ లాంటి మొక్కలు నాటి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఎకరానికి రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చుచేసి డ్రాగన్ మొక్కలు నాటారు. ఎకరానికి 15 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

సరికొత్త విధానంతో..

డ్రాగన్ సాగు టైరు, సిమెంట్ రింగ్ విధానంలో ఎకరానికి 2వేల మొక్కలు నాటగా, ఒక స్తంభం చుట్టూ నాలుగు వేల మొక్కలు నాటారు. ఎకరానికి 50 స్తంభాల చుట్టూ మొక్కలు నాటారు. దీని ఖర్చు రూ.5 లక్షలు వస్తుంది. సరికొత్త విధానం ట్రెల్లిస్ విధానంలో ఎకరానికి 5వేల నుంచి 8వేల మొక్కలు నాటినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఐదు అడుగుల స్తంభాలు పాతి వాటి చుట్టూ మొక్కలు నాటి తీగలు, యాంగ్లెర్లు బిగించి డ్రాగన్ మొక్కలు వాటి చుట్టూ అల్లిక చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ డ్రాగన్ ఫ్రూట్ రూ.70 నుంచి 100ల వరకు ఉంది. 15 రోజుల క్రితం 150 వరకు ఉండగా ఇటీవల పంట దిగుబడి ఎక్కువ రావడంతో ధర తగ్గినట్లు శ్రీనివాసరావు తెలిపారు. టన్ను పంట రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు వస్తుంది. కాగా ప్రతి 20 రోజులకోసారి పంట కోతకు వస్తున్నట్లు పేర్కొంటున్నారు.

శ్రీనివాసరావు నేపథ్యం

శ్రీశ్రీ అలియాస్ డాక్టర్ పారుపల్లి శ్రీనివాసరావు సౌదీ అరేబియాలోని కింగ్‌ఫైసల్ యూనివర్సిటీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా 16 సంవత్సరాలు పనిచేసి ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్‌లో 42 పరిశోధన వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ఒకే విద్యా సంవత్సరంలో ప్రచురించి అరుదైన ప్రపంచ రికార్డును నెలకొల్పారు. దీంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ వంటి అనేక రికార్డులు సాధించిన శ్రీశ్రీ మూడేళ్ల క్రితం ఇండియాకు వచ్చిన ఆయన తన శ్రీశ్రీ ఆర్గానిక్ ఫామ్స్‌లో డ్రాగన్ పంట సాగు చేస్తున్నారు.

సేంద్రియ వ్యవసాయం

శ్రీనివాసరావు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. జీవామృతం, ఘన జీవామృతం, ఆవులు, గేదెలు, గొర్రెలు, కోళ్ల ఎరువులతో పాటు అజోస్పోరియం, వ్యామ్, ఆముదం పిండి, వేప పిండి, వర్మీ కంపోస్ట్, బోన్‌మిక్చర్, ఫిష్ఎ మినో యాసిడ్, ట్రైకో పర్మీ, సుడోమోనాఫ్, నైట్రోబెంజిన్, బోన్‌మిన్, సల్ఫర్ బ్యాక్టీరియా, పాస్పసర్ బ్యాక్టీరియా, కానుగ పిండి, వేస్ట్ డీకంపోజర్, ట్రైకోడెర్మాతో పాటు పంచగవ్యం, దశపర్ణికషాయం, వేపనూనెలో కలిపి డ్రిప్ ద్వారా 20 రోజులకు నీరు అందిస్తారు. డ్రాగన్ పంట సీజన్ జూన్ నుంచి నవంబరు వరకు సాధారణ పంట వస్తుండగా, డిసెంబరు నుంచి మే వరకు అన్‌సీజన్‌లో ఈ పంటను విద్యుత్ ఎల్ఈడీ బల్బులను ప్రతి రెండు స్తంభాల మధ్య రెండు బల్బులు అమర్చి రాత్రిపూట సుమారు నాలుగు గంటల పాటు వెలిగిస్తారు. తద్వారా మొక్కకు తగిన వేడి లభించి పూత, పిందె వచ్చే లా చేస్తుంది. దీనివల్ల సీజన్‌తో సంబంధం లేకుండా 365 రోజులు పండించవచ్చని శ్రీశ్రీ తెలిపారు. శ్రీశ్రీ ఆర్గానిక్ క్షేత్రంలో డ్రాగన్ ఫ్రూట్స్ కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

సేంద్రియ వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం

సేంద్రియ వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. రైతులకు, ప్రజలకు మంచి పంటను అందించేందుకు డ్రాగన్ పంట సాగు చేశాను. మూడేళ్ల క్రితం డ్రాగన్ పంటను ఐదు ఎకరాల్లో సాగు చేస్తుండగా మొక్కలు నాటిన ఎనిమిది నెలల నుంచి దిగుబడులు వస్తున్నాయి. జూన్ నుంచి నవంబరు వరకు డ్రాగన్ పంట వస్తుంది. జూన్‌లో ప్రారంభమైన పండ్లు ప్రతి 20 రోజులకోసారి కాపునకు వస్తాయి. సంవత్సరానికి 8 నుంచి 10 కాపుల దాకా వస్తుంది. సుమారు 18 రకాల డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటగా అన్ని మంచి ఫలితానిస్తున్నాయి.



● పారుపల్లి శ్రీనివాసరావు(శ్రీశ్రీ), శ్రీనివాసపురం డ్రాగన్ ఫ్రూట్ రైతు

యాదగిరిగుట్టలో శివకేశవులకు విశేష పూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 28(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణం నిర్వహించారు. శివాలయంలోని ముఖ మండ పంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.13,28,316ల ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు. పాతగుట్టలో ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో సోమవారంతో ఆండాళ్ తిరునక్షత్రోత్సవాలు పరిసమాప్తి అయ్యాయి.

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శివకేశవుల ఆలయాల్లో హరిహరులకు విశేష అర్చనలు నిర్వహించారు. ఉదయం పంచసూక్త అభిషేకాలు చేపట్టాక ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, ఆర్జిత సేవలు నిర్వహించారు.

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

● నల్లగొండ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రదీప్ ● చిట్యాల మండలం వనిపాకలలో ఒకరికి డెంగీ

చిట్యాల రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జ్వరాలతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రదీప్, సామాజిక ఆరోగ్య అధికారి నర్సింగరావు సూచించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో ఒకరికి డెంగీ జ్వరం సోకింది. ఈ ఏడాది మొట్టమొదట నమోదైన డెంగీ కేసు ఇదే. దీంతో వైద్యాధికారులు ఆఇంటిని సోమవారం గుర్తించి ముందస్తు జాగ్రత్తగా ఆ ఇంటి పరిసర ప్రాంతాల్లో రాపిడ్ రెస్పాన్స్ టీంతో బ్లీచింగ్, దోమల నివారణకు పలు రసాయనాలను పిచికారీ చేయించారు. స్థానికంగా పలు వీధులను పరిశీలించి 50 నివాస ప్రాంతాల్లో లార్వా రీసోర్సెస్ సర్వే చేశారు. వర్షపు నీరు, నివాసాల్లో, ఇతర ప్రాంతాల్లో నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ డెంగీ జ్వరం దోమలు కుడితే వస్తుందని నివాసాల్లో, చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే ఆ ప్రదేశాలను దోమలు ఆవాసాన్ని ఏర్పరచుకుంటాయని, దోమ కాటుతో జ్వరం వస్తుందన్నారు.అధిక జ్వరం, తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, అలసట, వికారం, వాంతులు, చర్మంపై దద్దుర్లు కనబడితే డెంగీ లక్షణా లుగా గుర్తించి, వెంటనే వైద్యుడిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. వైద్యుడి సలహాలతో మందులు వాడితే డెంగీ తగ్గుతుందని, ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. నివాసాలు, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వలు లేకుండా దోమలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డి, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, స్వప్న, పుష్ప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తమైన వైద్య సిబ్బంది



చిట్యాల మండలం వనిపాకలలో డెంగీ జ్వరంపై వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారులు

చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో ఒకరికి డెంగీ జ్వరం వచ్చింది. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆకలిగా లేనందున చిట్యాల పీహెచ్‌సీకి ఈ నెల 25వ తేదీన వచ్చాడు. ఆయనను పరీక్షించిన వైద్యులు మందులు రాసి, పరీక్షలు చేశారు. మెడికల్ రిపోర్టు ప్రకారం డెంగీ జ్వరంగా నిర్ధారించారు. వెంటనే అప్రమత్తమైన వైద్యసిబ్బంది ఆయనను నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందాడు. . చికిత్స పూర్తయి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

బీ.వెల్లెంల రిజర్వాయర్ కుడికాల్వకు నీటి విడుదల నిలిపివేత

● అభ్యంతరం చెప్పిన రైల్వే అధికారులు
● రైల్వే ట్రాక్ పక్కన ఏర్పడిన నీటి మడుగు



గోపలాయపల్లి సమీపంలో రైల్వే ట్రాక్ పక్కనే నిలిచిన అలుగు నీరు

నార్కట్‌పల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్ ప్రధాన కుడి కాలువ గేటును సోమవారం సాయంత్రం నుండి మూసి వేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, బోరుబావులు ఎండిపోయిన నేపథ్యంలో రైతుల విజ్ఞప్తి మేరకు సాగు నీటి అవసరాల కోసం ప్రభుత్వ అనుమతితో ఈనెల 23న ప్రధాన కుడి కాలువ కు ఎమ్మెల్యే వేముల వీరేశం నీటి విడుదల చేసిన విషయం పాఠకులకు విదితమే. ప్రధాన కుడి కాలువకు మైనర్ కాల్వలను స్వచ్ఛందంగా తవ్వుకున్న రైతులు గోపలాయపల్లి, నార్కట్‌పల్లి చెర్వులకు నీరు చేరేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఐతే గోపలాయపల్లి చెరువు అలుగుపోసి నార్కట్‌పల్లి పెద్ద చెర్వుకు నీరు చేరేందుకు రైల్వే ట్రాక్ కల్వర్టు నుంచి రావాల్సి ఉంది. కల్వర్టు నుంచి విడుదలయ్యే నీటి సామర్థ్యం అలుగునీటి సామర్థ్యం కన్నా తక్కువగా ఉండటంతో అలుగుపోసిన నీరంతా రైల్వే ట్రాక్ పక్కనే కుంటలా ఏర్పడింది. దీంతో రైల్వే అధికారులు తీవ్ర అభ్యంతరం చెప్పారు. నీటి నిల్వ ఇలాగే ఉంటే రైల్ కట్ట కోతకు గురయ్యే ప్రమాదం ఉందని అభ్యంతరం చెబుతూ రైల్వే అధికారులు ప్రాజెక్టు ఇంజనీర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రాజెక్టు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతానికి కుడి కాలువ ద్వారా నీటి విడుదల నిలిపివేస్తున్నట్లు ఏఈఈ నవీన్ కుమార్ తెలిపారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి

ఫ్రాంక్లిన్, ఎస్ఈ, విద్యుత్ శాఖ సూర్యాపేట



వరుసగా వర్షాలు కురుస్తున్నాయి, విద్యుత్ సరఫరా సంబంధిత వస్తువులతో రైతులు, వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని సూర్యాపేట విద్యుత్ శాఖ ఎస్ఈ ఫ్రాంక్లిన్ సూచించారు. ఈదురు గాలులకు స్తంభాలు కూలిపోతుంటాయని, విరిగి పడుతుంటాయని, అప్రమత్తతే ఆయుధంగా వ్యవహరించాలని అన్నారు. ఆయన ‘ఆంధ్రజ్యోతి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

ఆంధ్రజ్యోతి: విద్యుత్ స్తంభాల్లో ఏ రకం స్తంభాలు మేలు.

ఎస్ఈ: ఐరన్ కంటే సిమెంట్ స్తంభాలు మేలు. ఇనుప స్తంభాలు చాలా ఏళ్ల క్రితం నుంచి వినియోగంలో ఉన్నాయి. వాటిని తగ్గించారు. ప్రస్తుతం సిమెంట్ స్తంభాలు ఏర్పాటుచేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రైతులు విద్యుత్ వినియోగంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎస్ఈ: రైతులు బోర్ల వద్ద స్టార్టర్లను తడి చేతులతో పట్టుకోవద్దు. స్టార్టర్ బాక్సుల దగ్గర ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయాన్ని రైతులకు వివరించాలని మండల స్థాయి అధికారులకు తెలియజేశాం.

ఆంధ్రజ్యోతి: ఇళ్లల్లో వినియోగదారులు ఎలాంటి చర్యలు తీసుకోవాలి.

ఎస్ఈ: ఇళ్లలో ఇనుప తీగలపై దుస్తులు ఆరవేస్తే ముప్పు ఉంటుంది. ఇనుప తీగ ఎక్కడైనా దెబ్బతింటే విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. రేకులకు విద్యుత్ సరఫరా అవుతోంది. తీగలకు రేకులకు తగలకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. సెల్‌ఫోన్ చార్జింగ్‌లో ఉండగా తడి చేతులతో పట్టుకుని మాట్లాడవద్దు.

ఆంధ్రజ్యోతి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతుల ఎలా వ్యవహరించాలి.

ఎస్ఈ: ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు వస్తే సొంత నిర్ణయాలతో మరమ్మతు చేయడానికి వెళ్లవద్దు. ఫ్యూజులు కూడా రైతులు నేరుగా వేసుకోవద్దు. ఆన్ ఆఫ్ స్విచ్‌లు వేసేటప్పుడు సైతం విద్యుత్ సరఫరాను నిలిపి ఫ్యూజులు వేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: విద్యుత్ సిబ్బంది స్పందించనప్పుడు ఎవరికి ఫిర్యాదుచేయాలి.

ఎస్ఈ: విద్యుత్ సిబ్బంది స్పందించకపోతే టోల్‌ఫ్రీ నెంబర్ 1912 కు ఫిర్యాదు చేయాలి. నేరుగా కార్పొరేట్ కార్యాలయానికి వెళుతుంది. అక్కడి నుంచి సమాచారం సంబంధిత ఏరియా సిబ్బందికి సమాచారం వెళుతుంది.

కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా ఈసం సుందర్

మర్రిగూడ, జూలై 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఈసం సుందర్‌ను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నియమించారు. సోమవారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నియామక పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సుందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి, నాయకులు నగారి ప్రీతం, బోడ స్వామి, గణేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి రూ.1 లక్ష అందజేత

మునుగోడు రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊకొండి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఇంద్రపాల ముత్యాలమ్మ దేవాలయానికి మునుగోడు గ్రామానికి చెందిన పాలకూరి నరసింహగౌడ్, రమాదేవి దంపతులు రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయంలో అమ్మవారు, పోతురాజు విగ్రహంతో పాటు గర్భాలయ రాతి సింహద్వారాల ఏర్పాటుకు దాత విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నరసింహగౌడ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం చేయండి


ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

'ప్రజావాణి'కి వెల్లువెత్తిన వినతులు

నల్లగొండ(కలెక్టరేట్), జూలై 28 (ఆంధ్రజ్యోతి): నష్టపరిహారం ఇప్పించాలని ఒకరు... పింఛన్ మంజూరు చేయాలని ఇంకొకరు... చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని మరొకరు ఇలా రకరకాల సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. వారిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై హాజరు కాగా మరికొందరు సామాజిక అంశాలపై వచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఇతర అధికారులతో కలిసి వినతులను స్వీకరించారు. వాటిలో కొన్నింటిని అక్కడిక్కడే పరిష్కరించగా మరికొన్నింటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.

పెన్షన్ కోసం తిరుగుతున్నా...



మా నాన్న తుపాకుల రాములు స్వాతంత్ర్య సమరయోధుడు. ఏడు నెలల క్రితం ఆయన మృతి చెందారు. ఆయనకు వచ్చే ఫ్రీడమ్ ఫైటర్స్ పింఛన్‌ను తన తల్లికి ఇవ్వాలని కోరుతూ అనేక మార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశాను. పింఛన్ల మంజూరు అనేది తమ పరిధిలో లేదు బ్యాంకు వాళ్ల పరిధిలో ఉందంటూ అధికారులు చెప్పడంతో బ్యాంకు అధికారులను కలిశాను. వారు కూడా తమ చేతిలో ఏమీ లేదంటూ చేతులెత్తేశారు. దయచేసి నా తండ్రి పింఛన్ నా తల్లికి ఇప్పించాలని కోరారు.

- తుపాకుల లక్ష్మయ్య, శాంతినగర్, మిర్యాలగూడ

పాఠశాల నిర్మాణ బిల్లు ఇప్పించండి



మా గ్రామంలో నేను అమ్మ ఆదర్శ పాఠశాలను నిర్మాణం చేశాను. సుమారు రూ.4.20లక్షల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేశాను. నా దగ్గర డబ్బులు లేకున్నా రూ.2 వడ్డీకి అప్పు తీసుకువచ్చి పనులు చేశాను. పనులు పూర్తయి ఏడాదవుతున్నా నేటికీ బిల్లులు చెల్లించడం లేదు. రోజురోజుకు బయట తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి. దయచేసి చేసిన పనులకు సంబంధించి బిల్లు ఇప్పించి ఆదుకోండి.

- శారద పందెనపల్లి, కట్టంగూరు

తెలంగాణ ఉద్యమకారుడికి అవమానం



నేను తెలంగాణ రాష్ట్ర సాధనలో జైలు జీవితం సైతం అనుభవించాను. ఉద్యమం అనంతరం ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రంలో కీలకంగా వ్యవహరించాను. ప్రస్తుతం సొంత గ్రామంలో నివాసముంటున్నాను. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు విడుదల చేసిన మొదటి జాబితాలో పేరు వచ్చింది. స్థానిక రాజకీయాల నేపథ్యంలో తుది జాబితాలో నా పేరు తొలగించారు. మా గ్రామంలో 10 ఎకరాల భూమి, ట్రాక్టర్లు ఉన్నవారికి కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. తనకు మాత్రం ఇవ్వలేదు. ఎంపీడీవోను కలిసి మూడు సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా తనకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని కేటాయించాలని కోరారు.

- షేక్ ముస్తఫా, ముషంపల్లి, నల్లగొండ

నష్టపరిహారం ఇప్పించండి



ప్రభుత్వం నూతనంగా నిర్మించిన యాదాద్రి పవర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణంలో నేను భూమిని కోల్పోయాను. థర్మల్ పవర్ ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు వేసిన పైప్‌లైన్ నిర్మాణంలో నేను సర్వే నెంబర్ 136లో గల నా 31 గుంటల భూమిని కోల్పోయాను. అయితే ప్రభుత్వం నుంచి కేవలం 21 గుంటలకు మాత్రమే నష్టపరిహారం అందింది. మిగతా 10 గుంటలకు పరిహారం ఇవ్వలేదు. దీనికోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. అదేవిధంగా పైపుల నిర్మాణం వేసేటప్పుడు నా భూమిలో పెద్దపెద్ద రాళ్లు, గుండ్లను వేశారు. వాటిని తొలగించమంటే అధికారులు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అధికారులు పట్టించుకోవడం లేదు. దయచేసి న్యాయం చేయండి.

- గుంజ సీతారాములు, వీర్లపాలెం, దామచర్ల

వితంతు పెన్షన్ ఇవ్వాలి



నా భర్త నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నాను. కానీ ఇంతవరకు కూడా పింఛన్ మంజూరు కాలేదు. ఎన్నోసార్లు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఇటీవల కొత్తగా విడుదలైన పింఛన్ల జాబితాలో కూడా నా పేరు రాలేదు. జాబితాలో తన పేరు లేదని అధికారులు మొర పెట్టుకున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. దయచేసి నాకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోగలరు.

- ఎస్ మాధవి, కొండమల్లేపల్లి.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


హాస్టల్‌లో విద్యార్థినుల భోజనాలను పరిశీలిస్తున్న జేడీ రమేష్

నల్లగొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థిని, విద్యార్థులకు మెరుగైన నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని పశు సంవర్థకశాఖ జేడీ, నల్లగొండ మండల ఇన్‌చార్జి డాక్టర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వంట గదులు, టాయిలెట్స్, స్నానపు గదులు శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోఎస్ స్వప్న, సత్యవతి, దూసరి భారతమ్మ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి చెరువుకు కృష్ణాజలాలు


నార్కట్‌పల్లి చెరువులోకి చేరుతున్న నీటిని పరిశీలిస్తున్న స్థానికులు

నార్కట్‌పల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్ కుడి కాల్వ ద్వారా కృష్ణా జలాలు ఎట్టకేలకు నార్కట్‌పల్లి పెద్ద చెరువును చేరుకున్నాయి. మూడు రోజుల క్రితం గోపలాయపల్లి చెరువులోకి కృష్ణాజలాలు చేరిన విషయం విదితమే. సుమారు 20ఎకరాల శిఖం విస్తీర్ణంలో ఉన్న గోపలాయపల్లి చెరువు నిండి అలుగుపోయడంతో అలుగు నీరంతా కృష్ణా జలాలు జాతీయ రహదారి కల్వర్టును దాటుకుని నార్కట్‌పల్లి చెరువుకు చేరుతున్నాయి. దీంతో ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు క్యూ కట్టారు. నార్కట్‌పల్లి చెరువులోకి నీటి ప్రవాహాన్ని ఐబీ డీఈఈ పిచ్చయ్య పరిశీలించి తగు సూచనలు చేశారు.

● నార్కట్‌పల్లి పెద్ద చెరువుకు బీ వెల్లెంల నీరు రావడంతో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడంటూ నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి చెరువులో క్షీరాభిషేకం చేశారు. చెర్వుకట్టపై ఉన్న గ్రామ దేవత కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ అయితరాజు యాదయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, జెరిపోతుల భరత్, గోసుల భద్రాచలం, దార యాదయ్య, జక్కలి పరమేశ్, తుపాకుల వెంకన్న, ముంత నర్సింహ, యేళ్ల వెంకన్న, బాబా, వేముల సత్యం, ప్రజ్ఞాపురం సత్తి, సమద్, శంకర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పత్తిలో చీడపీడల నివారణ


కేతేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో రైతులు పత్తి పంట లో సస్యరక్షణ చర్యలతో చీడపీడలను నివారించవచ్చని కేతేపల్లి ఏవో బి.పురుషోత్తం సూచించారు. సోమవారం మండలంలోని కొండకిందిగూడెం, బండ పాలెం గ్రామాల్లో ఆయన పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. పత్తి పంట 45-60 రోజుల దశలో ఉన్న ప్రస్తుత తరుణంలో వడ తెగులు, రసం పీల్చే పురుగుల ఉధృతి ఉండే వీలుందన్నారు. పొడ తెగులు గమనిస్తే లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మొక్కల మొదళ్లు తడిసేలా మొక్కల చుట్టూ పోయాలని సూచించారు. పంట త్వరగా కోలుకోవడానికి మల్టీకె లేదా లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున యూరియా కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పంటపై పిచికారీ చేయాలని సూచించారు. అలాగే రసం పీల్చే పురుగు నివారణకు లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3మి.లీ. లేదా ఎసిటమీప్రిడ్ 0.2 గ్రాములు లేదా థయోమిథగ్జామ్ 0.2 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2.0మి.లీ. చొప్పున కలిపి పంటకు పిచికారీ చేయడం ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఏవో వెంట ఏఈవో నాగరాజు, రైతులు కందుకూరి మోషయ్య, శ్రీను, రేణుక ఉన్నారు.

కంపెనీ విస్తరణ అనుమతులను రద్దు చేయాలి

నార్కట్‌పల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం రెవెన్యూ శివారు పరిధిలోకి వచ్చే సర్వే నెంబర్ 198, 199లలో మహారాష్ట్ర సీమ్లెస్ కంపెనీ విస్తరణకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని చెర్వుగట్టు దేవస్థానం మాజీ చైర్మన్ నల్ల వెంకన్న కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ విస్తరణ అనుమతి పొందేందుకు పాటించాల్సిన నిబంధనలను పాటించలేదని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా, గ్రామసభ తీర్మానం లేకుండా కాలుష్యకారకమైన కంపెనీ విస్తరణ పనులకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. విచారణ చేసి అనుమతి ఇచ్చిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నిండుకుండల్లా జలాశయాలు

(5వ పేజీ తరువాయి)


మూసీ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

పూర్తిగా నిండిపోవడంతో ఇప్పటికే కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 4.46 టీఎంసీలకు 3.99 టీఎంసీలకు నీటినిల్వ చేరుకొంది. ప్రతిరోజూ ఎగువనుంచి దాదాపు 1,280 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అంతే మొత్తంలో రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద నీటివిడుదల కొనసాగుతుండడంతో ఆయకట్టులో కుడికాల్వ కింద కేతేపల్లి, వేములపల్లి, మాడుగులపల్లి మండలాల్లోని గ్రామాల్లో, ఎడమకాల్వ కింద సూర్యాపేట, పెన్‌పహాడ్, చివ్వెంల మండలాల్లో ఆయకట్టులో వరినాట్లు ఉధృతమయ్యాయి. ఈవారాంతంలో ఆయకట్టులో నాట్లు దాదాపుగా పూర్తవుతాయని అంచనావేస్తున్నారు.

శాలిగౌరారం దాదాపు పూర్తయిన వరినాట్లు

జిల్లాలో మూసీ నదిపై ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు నీటితో నిండిపోయింది. శాలిగౌరారం మండలంలో దాదాపు ఆరువేల ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టు కింద రెండు కాల్వలకు నీటివిడుదల కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే దాదాపు వరినాట్లు పూర్తయ్యాయి. ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో సమీపంలోని బోరుబావుల్లోకి సైతం నీటిమట్టాలు పెరగడంతో నాన్ ఆయకట్టులోనూ వరినాట్లు కొనసాగుతున్నాయి.

వరద కాల్వకు 300 క్యూసెక్కుల నీరు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో వరదకాల్వ(లోలెవల్ కాల్వ)కు సైతం అధికారులు సోమవారం 300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదలచేశారు. హాలియా మండలంలోని యాచారం వరకు నీరు ఇప్పటికే రాగా, నీటివిడుదల కొనసాగుతుండడంతో మంగళవారం రాత్రికి చివరి వరకు నీరు చేరుతుందని అంచనావేస్తున్నారు. ఈ కాల్వ కింద పెద్దవూర, హాలియా, నిడమనూరు, త్రిపురారం, మాడుగులపల్లి , కనగల్లు మండలలాల్లో దాదాపు 50వేల ఎకరాలకు సాగునీరందుతుంది. అంతేకాకుండా సమీపంలోని చెరువులను నింపడం ద్వారా బోరుబావులలో నీటిమట్టాలు పెరుగుతాయి. తద్వారా ప్రత్యక్ష ఆయకట్టుతో పాటుగా, బోరుబావుల కింద సైతం సాగుకు భరోసా దక్కుతుంది. ఈ ఆయకట్టు కింద ఇప్పటికే రైతులు నారుమళ్లు సాగుచేయగా, నీటివిడుదలతో నాట్లకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఎత్తిపోతలకు సైతం నీటిని విడుదల చేయాలంటోన్న రైతులు

ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులన్నీ నీటితో నిండిపోవడంతో ప్రాజెక్టుల కింద కాల్వలకే కాకుండా సాగర్ ఎడమకాల్వపై నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఉన్న దాదాపు 45 వరకు ఉన్న ఎత్తిపోతల పథకాలకు సైతం నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. మేజర్లతో పాటుగా, వీటికి సైతం సకాలంలోనే నీటిని విడుదల చేస్తేనే సీజన్‌లో రైతులకు ఇబ్బంది ఉండదని ఆ దిశగా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పలు ఎత్తిపోతల పథకాలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సి ఉందని, తక్షణమే వాటిని పూర్తిచేసి నీరందించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కట్టంగూరుకు నేడు ముగ్గురు మంత్రుల రాక


కట్టంగూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కట్టంగూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): కట్టంగూరుకు మంగళవారం ముగ్గురు మంత్రులు రానున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, నీటిపారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య తెలిపారు. కట్టంగూరులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కట్టంగూరు మండలానికి చెందిన నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, నాయకులు రెడ్డిపల్లి సాగర్, పోగుల చంద్రయ్య, అయితగోని నారాయణ, మిట్టపల్లి శివ, గద్దపాటి దానయ్య, అయితగోని నర్సింహ, కొంపల్లి యాదయ్య, నారాయణ, శేఖర్, రెడ్డిపల్లి స్వామి, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

సభాస్థలిని పరిశీలించిన ఆర్డీవో


కట్టంగూరులో సభాస్థలిని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఆర్డీవో, అధికారులు, నాయకులు

కట్టంగూరు: కట్టంగూరులో మంగళవారం ముగ్గురు మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కట్టంగూరులోని సంత ఆవరణలో ఏర్పాటు చేయనున్న సభా స్థలాన్ని సోమవారం సాయంత్రం నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి పరిశీలించారు. ఈ సభాస్థలి ఏర్పాట్లు వేగంగా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శాలిగౌరారం రూరల్ సీఐ కొండల్‌రెడ్డి, కట్టంగూరు ఎస్ఐ రవీందర్, ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీ సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, నాయకులు రెడ్డిపల్లి సాగర్, దానయ్య, మిట్టపల్ల శివ, సైదులు, శేఖర్, వీరస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో క్రెడాయ్ ముందుంటుంది

● చైర్మన్ బండారు ప్రసాద్, అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న క్రెడాయి అధ్యక్షుడు బండారు, వేదికపై బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో క్రెడాయి సంస్థ ముందుంటుందని చైర్మన్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బండారు ప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్మన్, అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్రెడాయి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటడం, వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఇంజనీరింగ్ డే లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా సంస్థ నూతన భవన నిర్మాణానికి అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. అనంతరం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో క్రెడాయి నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బండారు ప్రసాద్, అధ్యక్షుడిగా బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్టెడ్ ప్రెసిడెంట్ ఆమంచి రాజలింగం, జనరల్ సెక్రటరీ నాంపల్లి మనోహర్, కోశాధికారి దూదిపాల వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఏదుళ్ల శ్రీధర్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాసరావు, ఆవుల శ్రీను, మందడి వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ గుండెబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, బొడ్డుపల్లి సతీష్, పృథ్వీరాజ్, రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వంగాల అనిల్‌రెడ్డితో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్‌ఫండ్‌ను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు, క్షయ బాధితులకు న్యూట్రిషన్ కిట్లు సోమవారం ఆయన వేర్వేరుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు. క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో నకిరేకల్ బైపాస్ రోడ్డులో ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, ఏఎంసీ చైర్ పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు నకిరేకంటి యేసుపాదం, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, వైద్యశాఖ అధికారులు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్లు యోగస్వీ, అర్చన, శ్వేత, విస్తరణ అధికారి నర్సింహాచారి, సీహెచ్‌వో వరుసునంద, నర్సింహారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పేద విద్యార్థిని నీట్ కోచింగ్‌కు ఎమ్మెల్యే సహాయం

చిట్యాలరూరల్: చిట్యాల మండలం చిన్నకాపర్తికి చెందిన మస్కు నందిని నీట్ కోచింగ్‌కు అవసరమైన మొత్తాన్ని తాను భరిస్తానని ఎమ్మెల్యే వీరేశం హామీ ఇచ్చారు. మస్కు నందిని ఇంటర్‌లో 989మార్కులు సాధించింది. ఎంబీబీఎస్ చదివేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుందర్‌యాదవ్ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా మొత్తం ఫీజును తాను భరిస్తానని హామీ ఇచ్చారు.

'స్థానిక' ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి

● మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్


శాలిగౌరారంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మండల సన్నాహక సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

శాలిగౌరారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సమన్వయంతో పని చేసి అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక పాలన చేస్తోందని ఆరోపించారు. ఎప్పటికైనా రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీ రామరక్ష అన్నారు. కేసీఆర్ వల్లే నేడు తెలంగాణ వచ్చిందని, బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కు అయ్యాయని, అందుకే ఈ రెండు పార్టీలు బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులా ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షులు అయితగోని వెంకన్నగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు చాడ హతీష్‌రెడ్డి, మామిడి సర్వయ్య, కట్ట వెంకటరెడ్డి, గుండా శ్రీనివాస్, గుజిలాల్ శేఖర్ బాబు, జెరిపోతుల చంద్రమౌళి, దుబ్బ వెంకన్న, కల్లూరి నాగరాజు, చివుట సైదులు, రమేష్, శ్రీరాములు, రాములు, నర్సయ్య, సురేష్, వెంకన్న, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీ మేరకు దివ్యాంగుల పింఛన్ పెంచాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్

చిట్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు దివ్యాంగుల పింఛన్ రూ.6వేలు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ డిమాండ్ చేశారు. చిట్యాలలో సోమవారం నిర్వహించిన వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వృద్ధులు, వితంతువుల పింఛన్ రూ.2 నుంచి రూ.4 వేలకు పెంచాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మాదిగల కోసం ఏర్పడినప్పటికీ సామాజిక సమస్యలపై కూడా పోరాటం చేస్తుందన్నారు. వచ్చే నెల 1వ తేదీన మిర్యాలగూడెంలో నిర్వహించే చేయూత పింఛన్‌దారుల నల్లగొండ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నక్క కృష్ణ, జోగు చంద్రమౌళి, వీహెచ్‌పీఎస్ నాయకులు వేలుపల్లి మధు, తుమ్మల లక్ష్మారెడ్డి, బొబ్బల నగేష్, నూనె అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి పంచామృతాభిషేకాలు

నార్కట్‌పల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గోదాదేవి పుట్టినరోజు సందర్భంగా నార్కట్‌పల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవికి పంచామృతాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశంపారంపర్య అర్చకుడు కారంపూడి కృష్ణమాచార్యుల అర్చకత్వంలో నిర్వహించిన గోదాదేవికి అభిషేక ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని పాలు, పెరుగు, చక్కెర, తేనె, నెయ్యి వంటి పంచామృతాలతో అభిషేకించి భక్తితో కొలిచారు. ఈ వేడుకలో దేవస్థాన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దోసపాటి ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఐతరాజు రమేష్, పసునూరి పాండురంగయ్య, దోసపాటి వేణు, విష్ణు, రఘు, బండారు రమేష్, బిల్లకంటి శ్రీకాంత్, రంగ కృష్ణయ్య, భరత్, పూలమ్మ, లీల, పద్మ, కళమ్మ పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కనగల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కనగల్ ఎక్స్‌రోడ్డులోని శ్రీ భూనీలా సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షిక వేడుకలను ఈ నెల 30 నుంచి 31వ తేదీ వరకు న్విహించనున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త బుసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌చిట్ల లింగయ్యగౌడ్, ఆలయ అర్చకులు పల్లిగుంతుల వెంకటాచార్యులు, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న బుధవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, 31న గురువారం స్వామివారి తిరుకల్యాణం (శాంతికల్యాణం) నిర్వహించనున్నారు. తిరుకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కల్యాణం అనంతరం దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	584.70 (296.5695)	1,47,195	42,913
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.20 (3.99)	1,604.61	1,904.00
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	158.463 (23.8180)	26,281	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.137 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులకు వరదనీరు పోటెత్తుతోంది. నాగార్జునసాగర్, మూసీ, డిండి, శాలిగౌరారం, అక్కంపల్లి, బ్రాహ్మణవెల్లంల రిజర్వాయర్లన్నీ పూర్తిస్థాయి నీటిమట్టాలకు చేరడంతో నిండుకుండల్లా మారిపోయాయి. మూసీ ప్రాజెక్టులు, కాల్వల కింద ఇప్పటికే సాగునీటిని విడుదల చేయగా, ఆయకట్టులో నాట్లు కొనసాగుతున్నాయి. నాగార్జునసాగర్, డిండి, ఏఎమ్మార్పీ ప్రాజెక్టుల కింద ఈ వారంలో నీటివిడుదలకు రంగం సిద్ధం చేశారు. ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లంల కింద చెరువులను నీటితో నింపడంతో బోరుబావులలో నీటిమట్టాలు పెరిగి సాగు మొదలైంది. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్టుల కింద వానాకాలం సీజన్‌లో సాగు ఉత్సాహంగా మొదలైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)



ప్రాజెక్టులకు జలకళ

నిండుకుండల్లా జలాశయాలు

- నేడు నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లు ఎత్తివేత
- మూసీ, శాలిగౌరారం కాల్వల కింద మొదలైన సాగు
- సాగర్ వరద కాల్వ (ఎల్ఎల్‌సీ)కి 300 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల



నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 5.20 లక్షల ఎకరాలతో పాటు ఖమ్మం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు సాగు, తాగునీటిని అందించే నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఈ సారి ముందుగానే నిండింది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో 312 టీఎంసీల సామర్థ్యానికి గాను ఇప్పటికే 295 టీఎంసీలకు నీరు చేరడంతో ఇప్పటికే కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమకాల్వ ద్వారా దిగువన పాలేరు రిజర్వాయర్ నింపుతూ, మరోవైపున నల్లగొండ జిల్లా పరిధిలోని రాజవరం, ముదిమాణిక్యం, వజీరాబాద్, ముల్కలకాల్వ మేజర్లకు నీటిని విడుదల చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా పరిధిలోని మేజర్ల కింద మరమ్మతులు కొనసాగుతుండడంతో ముక్త్యాల బ్రాంచి కాల్వ, జానపహాడ్‌మేజర్, ఇతర మేజర్లన్నింటికీ ఆగస్టు 1వ తేదీన నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. కాల్వలకు నీరు విడుదల చేయక పోయినప్పటికీ ప్రాజెక్టు నిండడంతో సీజన్‌లో నీటికి ఇబ్బంది లేని పరిస్థితి ఏర్పడడంతో రైతాంగం సాగు పనులు ముమ్మరం చేశారు. బోరుబావులు, బావుల ద్వారా నారుమళ్లు పెంచిన రైతులు నీరు అందుబాటులో ఉన్నచోట్ల వరినాట్లు వేస్తుండగా, బోర్లు, బావులు లేని రైతులు నాట్లకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మేజర్లకు, మైనర్లకు నీరిచ్చిన తక్షణమే వరినాట్లు పూర్తిచేసేలా రైతాంగం ఏర్పాట్లు చేసుకుంది.

ఏఎమ్మార్పీ కింద డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల

జిల్లాలోని దేవరకొండ, మునుగోడు, నాగార్జునసాగర్, నకిరేకల్ నియోజకవర్గాల్లో 2.20 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ఏఎమ్మార్పీ ప్రాజెక్టు కింద ఇప్పటికే ఉదయసముద్రం రిజర్వాయర్‌ని నీటితో నింపారు. ప్రస్తుతం మూడు మోటర్ల ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయ్‌కు తరలించి, అక్కడి నుంచి ప్రధాన కాల్వ ద్వారా విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచి ఈ ప్రాజెక్టు కింద ఉన్న 55 డిస్ట్రిబ్యూటరీ కాల్వల ద్వారా సాగుకు నీటిని విడుదల ప్రారంభించారు. వారబందీ పద్ధతిలో ఈడీసీలకు నీటి విడుదల కొనసాగుతుందని ప్రాజెక్టు ఈఈ సత్యనారాయణ వెల్లడించారు. అయితే రైతులు డీసీల ద్వారా ఈ ప్రాజెక్టు పరిధిలో ఉండే దాదాపు 98 చెరువులను నింపాలని కోరుతుండగా, ప్రస్తుతానికి ప్రత్యక్ష సాగుకు నీటిని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అంగడిపేట వద్ద డీ-8, 9 కాల్వలకు ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయగా, నల్లగొండ మండలంలో డీ-37 కాల్వకు ఇంజనీర్లతో కలిసి కాంగ్రెస్ నాయకులు గుమ్ముల మోహన్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ జూలకంటి వెంకటరెడ్డి తదితరులు నీటిని విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నానికి అన్ని డిస్ట్రిబ్యూటరీల ద్వారా ఈ ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మరోవైపున ఇప్పటికే ఏఎమ్మార్పీ ద్వారా ఉదయ సముద్రం నుంచి బ్రాహ్మణవెల్లంల రిజర్వాయర్‌కి నీటిని పంపింగ్ చేసి ఆ రిజర్వాయర్‌ని సగం మేర నింపి, ప్రధాన కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 చెరువులను నింపారు. దీంతో నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లోని 10వేల ఎకరాలకు సాగునీటికి భరోసా దక్కిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

30 నుంచి డిండి కాల్వలకు నీటి విడుదల

జిల్లాలోని దేవరకొండ నియోజకవర్గంలోని 12,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే డిండి ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తుతోంది. దుందుభి నది నుంచి నీరు భారీగా వస్తుండడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 2.40టీఎంసీలకుగాను ఇప్పటికే 0.434 టీఎంసీలకు చేరింది. అయితే ఎగువన దుందుభితో పాటు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీరు రిజర్వాయర్‌కు వస్తుండడంతో ఈ ప్రాజెక్టు కింద కాల్వలకు నీటిని విడుదల చేయాలని ఇటీవల రైతుల సమావేశంలో నిర్ణయించినమేరకు ఈనెల 30వ తేదీ నుంచి కుడి, ఎడమకాల్వలకు నీటిని విడుదల చేయనున్నారు. ఆయకట్టులో రైతులు ఇప్పటికే బోర్ల కింద నారుమళ్లు పెంచుకుంటుండగా, కాల్వల నీరు వస్తే వెంటనే నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు.

మూసీ ఆయకట్టులో ఉధృతంగా వరినాట్లు

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 35 వేల ఎకరాలకు సాగునీరందించే మూసీ ప్రాజెక్టు..

- మిగతా 8వ పేజీలో...

ఐదు నియోజకవర్గాల్లో

నేడు మంత్రుల పర్యటన

నల్లగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటితో నిండిపోవడంతో మంగళవారం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఉదయం ప్రాజెక్టు వద్ద పూజలు నిర్వహించి క్రస్ట్‌గేట్లు ఎత్తనున్నారు. ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతున్న నేపథ్యంలో పవర్‌హౌజ్, క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు 50వేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు.

నేడు ఉమ్మడి జిల్లాలో రేషన్‌కార్డుల పంపిణీ

ఉమ్మడి జిల్లాలోని నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, నకిరేకల్, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో మంగళవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో 10 గంటలకు సాగర్‌కులో మంత్రులు ప్రాజెక్టు గేట్లు ఎత్తే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి 11.20 గంటలకు పెద్దవూరలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అ నంతరం 12.45 గంటలకు హుజూర్‌నగర్ చేరుకుంటారు. అక్కడ హుజూర్‌నగర్ ని యోజకవర్గంలోని లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారు. అనంత రం నకిరేకల్, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం లో పాల్గొని రాత్రికి తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను

సకాలంలో పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విపత్తు నిర్వహణకు సంబంధించి ఆయా శాఖలు వారి కార్యాచరణ ప్రణాళికను వారం రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని,ఒకవేళ సమస్య పరిష్కారం కానట్లయితే సంబంధిత ఫిర్యాదుదారుడికి తెలియజేయాలని సూచించారు. డివిజన్, మండల గ్రామస్థాయిలో సైతం ఇదేవిధంగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. సోమవారం 130 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 61, రెవెన్యూ శాఖకు 69 ఫిర్యాదులు వచ్చాయి. స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

'మధ్యాహ్న' పెండింగ్ బిల్లులు

వెంటనే చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ

నల్లగొండ(కలెక్టరేట్), జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉంచిన బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులతో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పది నెలల నుంచి పెట్టుబడి పెడుతున్నారని అన్నారు. ఐదు నెలలుగా వేతనాలు, తొమ్మిది నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులు రాక కుటుంబాలను గడపలేక, అప్పులు తెచ్చిన చోట అవమానాలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం గుడ్లకు ఇచ్చే ధర రెండు గుడ్లకు సరిపోగా మూడో గుడ్డు పెట్టాలని అధికారులు కార్మికులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. పెట్టిన వాటికే పది నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులు ఇంకా ఎంత అప్పు చేసి పెడతారని ప్రశ్నించారు. పెండింగు వేతనాలు, బిల్లులు చెల్లించాలని కార్మికులు అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. యు కుబేర్‌లో బిల్లులు ఉన్నాయని, మాకు సంబంధం లేదని అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సక్రమంగా సాగాలంటే బకాయి వేతనాలు, బిల్లులు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని కోరారు. కార్మికులకు గ్రీన్‌ఛానల్ ద్వారా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్‌కె కరీమునిసా అధ్యక్షతన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి అనురాధ, జిల్లా నాయకులు నోముల వసంత, కొప్పు అండాలు, ఒంటిపాక సైదమ్మ, బి.శారద, దండ పుష్పలత, డి.సరోజ, గద్దపాటి లక్ష్మమ్మ, ఎల్లయ్య, లలిత, లక్ష్మమ్మ, వేముల రేవతి, పోలే నాగమ్మ మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద కాల్వకు నీటి విడుదల



పెద్దవూర, జూలై 28(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి శ్రీశైలం లోలెవల్ కెనాల్ (వరదకాల్వ)కు సోమవారం ఇరిగేషన్ అధికారులు సోమవారం సాగునీటిని విడుదల చేశారు. మండలంలోని పూల్యతండా వద్ద గల పంప్‌హౌస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి ఇరిగేషన్ ఈఈ సత్యనారాయణ, డీఈ వేణు వరద కాల్వలోకి 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ వరద రావడంతో ప్రాజెక్టు నీటిమట్టం 585 అడుగులకు చేరుకుంది. దీంతో వరదకాల్వకు నీటి విడుదల చేసే అవకాశం కలిగింది. ఈ కాల్వ ద్వారా పెద్దవూర, అనుముల, నిడమనూరు, త్రిపురారం మండలాలలోని సుమారు 50వేల ఎకరాలకు సాగునీటిని అందించనున్నారు. మొదటి విడతలో 30 డిస్ట్రిబ్యూటర్ల పరిధిలోని మైనర్‌కాల్వలకు సాగునీరు అందించడంతోపాటు చెరువులు, కుంటలను నింపుతామని, రెండో విడతలో మిగిలిన 1, 2 డిస్ట్రిబ్యూటర్లకు నీటిని విడుదల చేస్తామని డీఈ వేణు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ప్రీప్రైమరీ

» జిల్లాలో 35 ఎంపీపీఎస్‌ల్లో ఏర్పాట్లు » ఆగస్టు 15 నుంచి తరగతుల ప్రారంభానికి సన్నాహాలు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ(ఎల్‌కేజీ, యూకేజీ) నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లాలోని 35 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు. ప్రతీ యేటా ఆన్‌లైన్‌లో నమోదు చేసే యూడైసీ వివరాల ఆధారంగా ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు పాఠశాలల ఎంపిక జరిగింది. అదనపు తరగతి గదులు ఉండటం, జీరో ఎన్‌రోల్‌మెంట్ వంటి అంశాలే ప్రామాణికంగా ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపిక చేసినట్లు తెలిసింది. కాగా ఆగస్టు 15 నుంచి తరగతుల ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)



ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ విధానం లేకపోవడంతో ప్రైవేట్ వైపు వెళ్తున్నారన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుడుతోంది. వచ్చే విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో చేరేందుకు అర్హత కలిగిన చిన్నారులను ప్రీప్రైమరీకి ఎంపిక చేయనున్నారు. ఈ పాఠశాలలను ఆగస్టు 15వ తేదీ నుంచి లాంఛనంగా ప్రారంభించేలా జిల్లా విద్యాశాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1000 ఎంపీపీఎస్‌లలో ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించనున్నారు.

జిల్లాలో ఎంపికైన ఎంపీపీఎస్‌లు

జిల్లాలో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు 35 పాఠశాలలు ఎంపికచేశారు. ఎర్రచెరువుతండా, రావులపెంట, నర్సాపూర్, శేరిపల్లి, మల్లారెడ్డిపల్లి, కడపర్తి, తిర్మలగిరి, ఖిల్లాబజార్ దేవరకొండ, అమ్మగూడెం, ఎలికట్టె, చందంపల్లి, మర్రూర్, దొనియాల, ముత్యాలమ్మబజార్ దేవరకొండ, అమ్మనబోలు, బోయనపల్లి, ఎరగుంట్లపల్లి, తెట్టెకుంట, వెంకటాద్రిపాలెం, బోయగుబ్బ, ఎనుగులదొరి, పూలగూడెం, కొండమల్లేపల్లి, బోడంగిపర్తి, బుద్దారెడ్డిగూడ, తేనేపల్లి తండ, జిన్నాయి చింత, కందిమల్లివారిగూడెం, పెద్దతండ, చింతపల్లి, సోలిపురం, హరిజనవాడ ఉట్లపల్లి, ఎస్‌సీ కాలనీ అజ్మాపురం, వైజాగ్‌కాలనీ, బచ్చాపురం, కామారెడ్డిగూడెంలు ఉన్నాయి.

ఇన్‌స్ట్రక్టర్, ఆయాల నియామకం

ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ఎంపికైన పాఠశాలల్లో టీచర్, ఆయాలను నియమించనున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక ప్రక్రియ జరగనుంది. ఇంటర్ ఆపై తరగతులు చదివిన అదే గ్రామానికి చెందిన స్థానికులైన వారై ఉండాలని నిబంధన విధించారు. అదేవిధంగా ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఆపైన చదివిన వారినే అర్హులుగా పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ లోపు వీరి నియామకం జరగనున్నట్లు తెలిసింది. ఎంపికైన పాఠశాల ప్రధానోపాధ్యాయులందరితో వారం రోజుల్లో కలెక్టర్, డీఈవోల సమక్షంలో సమావేశం నిర్వహించనున్నారు. నియామకమైన టీచర్, ఆయాలపై అదే పాఠశాల హెచ్‌ఎంలకు పర్యవేక్షణాధికారం ఉండనుంది.

రూ.1.50లక్షలతో భవనాల సుందరీకరణ

ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలలో ఓ గదిని ప్రత్యేకంగా కేటాయించనున్నారు. ఆ గదికి మరమ్మతులుంటే చేయించి పూర్తిగా పిల్లలు ఇట్టే ఆకర్షించేలా రంగులు, వివిధ రకాల బొమ్మల పెయింటింగ్‌తో సుందరీకరించనున్నారు. చిన్నారుల కోసం ఫర్నీచర్ కొనుగోలు చేయనున్నారు. ఇందుకోసం ప్రతీ ప్రీ ప్రైమరీ పాఠశాలకు సుమారు రూ.1.50లక్షల చొప్పున కేటాయిస్తున్నట్లు తెలిసింది. ఈ నిధులను ఆయా పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాటైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ఖర్చు చేయనున్నారు. కాగా ప్రీప్రైమరీ తరగతుల కోసం వచ్చే చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని ఆయా పాఠశాలలు, సాయంత్రం స్నాక్స్‌ను అంగన్‌వాడీలు సమకూరుస్తారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు మా పాఠశాలను ఎంపిక చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం తీసుకువస్తున్న సంస్కరణలను యూటీఎఫ్ పక్షాన స్వాగతిస్తున్నాం. వీలైనంత మేరకు ప్రీ ప్రైమరీ విద్యార్థులను స్పెషల్ డ్రైవ్ ద్వారా చేర్పించి తరగతులను నిర్వహిస్తాం. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఉపాధ్యాయలోకం సద్వినియోగం చేసుకుంటుందని బావిస్తున్నా.

- నర్రా శేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఎంపీపీఎస్, ఎనుగులదొరి, నార్కట్‌పల్లి మండలం

శ్రమదానం, పాదయాత్రల రాష్ట్ర కోఆర్డినేటర్‌గా జూలూరి



దేవరకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ శ్రమదానం, పాదయాత్రల రాష్ట్ర కోఆర్డినేటర్‌గా దేవరకొండ మండలం తాటికోలుకు చెందిన మాజీ సర్పంచ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జూలూరి ధనలక్ష్మీబాలనారాయణగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రమదానం, పాదయాత్రల కోఆర్డినేటర్‌గా జూలూరి ధనలక్ష్మీ బాలనారాయణగౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా జూలూరి ధనలక్ష్మి మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫికర్

- అడుగు వేయలేం, రోడ్డు దాటలేం
- మిర్యాలగూడలో పెరుగుతున్న రద్దీతో ప్రజల ఇక్కట్లు

వివరాలు 8లో

యూరియా కొరత లేదు

జేడీఏ శ్రవణ్ కుమార్



నల్లగొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌కు సంబంధించి సోమవారం సాయంత్రం నాటికి ఇంకా 8,363 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, యూరియాకు ఎలాంటి కొరత లేదని జేడీఏ పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల కోటాకు సంబంధించి మొత్తం 17,499 మెట్రిక్ టన్నులకు పైగా యూరియా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఇంకా 8,363 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. మండల కేంద్రాల్లో 6 వేల మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ గోదాములలో 1800 మెట్రిక్ టన్నులు ఉండగా మరో 700 మెట్రిక్ టన్నుల యూరియా మంగళవారం ఉదయం నాటికి జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు. మరో రెండు రోజుల్లో 2వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని వివరించారు. ఇకపోతే ఆగస్టు నెలకు సంబంధించి 20,999 మెట్రిక్ టన్నులు యూరియా రానుంది.

సెప్టెంబరు నెలకు కూడా 20,999 మెట్రిక్ టన్నులు ఆ నెలలో కేటాయించినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద రైతులు ముందస్తుగానే జూన్, జూలై మాసంలోనే 7వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారని తెలిపారు. జిల్లాలో డీఏపీ 1026 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 1917 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకెఎస్ 18,844 మెట్రిక్ టన్నులు, ఎస్‌ఎస్‌పీ 1383 మెట్రిక్ టన్నులు, కంపోస్టు ఎరువులు 103 మెట్రిక్ టన్నులు, ఎఫ్‌వోఎం 53 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని జేడీఏ శ్రవణ్ కుమార్ వివరించారు. రైతులకు అవసరాలకు అనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు ఎంజీయూకు తెలంగాణ విద్యా కమిషన్ రాక

నల్లగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ఆచార్య విశ్వేశర్‌రావు, డాక్టర్ చారుకొండ వెంకటేష్, కె.జోత్స్న, శివారెడ్డి మంగళవారం ఎంజీయూను సందర్శించనున్నట్లు రిజిస్ట్రార్ అల్వాల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీ యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో 10.30 గంటలకు విద్యా అంశాలపై చర్చించనున్నారు. ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ తొలిప్రసంగంతో కార్యక్రమాలు మొదలవుతాయని పేర్కొన్నారు. సెమినార్‌కు విద్యార్థి సంఘాల నాయకులు, ప్రిన్సిపాల్స్, అవుట్‌సోర్సింగ్, జర్నలిస్టులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కొండమల్లేపల్లి మండలం చింతచెట్టుతండా, వద్యతండా, జేత్యతండా, పుల్‌సింగ్‌తండాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన నిధులతో శంకుస్థాపనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నాడని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో కొండమల్లేపల్లి మండల మాజీ అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, నాయకులు రమావత్ దస్రునాయక్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, దేవేందర్, బద్రునాయక్, తులసీరాం, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న రవీంద్రకుమార్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

హాలియా,జులై28(ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హాలియా ఎస్ఐ సాయిప్రశాంత్ అన్నారు. సోమవారం అనుముల మండలంలోని మారేపల్లి గ్రామంలోని మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేడు అనేక రకాలుగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు మోటార్ వాహన చట్టం ప్రకారం అవసరమైన డాక్యుమెంట్లపై అవగాహన కల్పించి తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

శివాలయంలో భక్తుల సందడి

చింతపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్) రామలింగేశ్వర ఆలయం, చింతపల్లి శివాలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాల్లో చేరుకొని పంచామృతాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు ముకిరాల శ్రీకాంత్‌శర్మ, కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న శివశంకర్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి మండల కేంద్రానికి చెందిన నిమ్మల శివశంకర్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగంలో డా. రాజు పాడియా పర్యవేక్షణలో 'వృక్ష ఆధారిత సమ్మేళనాల స్క్రీనింగ్, లక్షణ నిర్ధారణ' అనే శీర్షికతో పరిశోధనలు చేశారు. డయాబెటిస్ నియంత్రణలో సహాయపడే వృక్ష సమ్మేళనాలను గుర్తించారు. ఈ పరిశోధనకు ఫలితంగా ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేశారు. ప్రస్తుతం శివశంకర్‌రెడ్డి ఫుడ్‌సేఫ్టీ జిల్లా అధికారిగా పనిచేస్తున్నారు. ఈ పీహెచ్‌డీ పొందినందుకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి అభినందించారు.

ట్రాఫికర్

అడుగు వేయలేం రోడ్డు దాటలేం

లక్షన్నర జనాభా ఉన్న మిర్యాలగూడ పట్టణంలో ఒకటే ప్రధాన రహదారి ఉంది. అదే సాగర్‌రోడ్.. అంటే ప్రస్తుతం విస్తరణకు నోచుకుంటున్న కోదాడ-జడ్చర్ల హైవే అది. దానినే ఖమ్మం రోడ్డని, గుంటూరు దారని, దేవరకొండ బాటని అంటారు. అయితే ఆ దారిలో అడుగు వేయలేం, రోడ్డు దాటలేం. ఎందుకంటే అక్కడ ఎప్పుడూ వాహనాలు రయ్ రయ్‌మంటూ పరుగులు తీస్తాయి. పాదచారులు రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

శరవేగంగా విస్తరించడంతో మిర్యాలగూడ పట్టణంలో రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. విద్య, వైద్యం, వ్యాపార, వాణిజ్య రంగాల్లో సేవలందుతుండటంతో పరిసర ప్రాంతాల నుంచి సుమారు 50వేల మంది పట్టణానికి వస్తుంటారు. స్థానికుల వాహనాలతోపాటు ఇక్కడకు వచ్చి పోయే వారి వాహనాలతో ఏకైక రహదారి నిండిపోతుండగా, ట్రాఫిక్ జామ్ అవుతోంది. గతంలో రాజీవ్ చౌక్ నుంచి గాంధీ విగ్రహం వరకే ట్రాఫిక్ ఇబ్బంది ఉండగా, వాహనాల సంఖ్య పెరగడంతో ఈదులగూడ నుంచి రైల్వేట్రాక్ వరకూ ఇదే పరిస్థితి ఉంది.

ఎత్తయిన భవనాలు, ఇరుకైన వీధులు

వ్యాపార, వాణిజ్య రంగాల్లో పట్టణం పేరొందడం హర్షించదగిందే. అయితే ఇక్కడ ఎత్తయిన భవనాలు, బహుళ అంతస్తుల భవనాలు కన్పిస్తుండగా, రహదారులు మాత్రం ఇరుకుగా ఉంటాయి. కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టినా, పార్కింగ్‌కు కాసింత స్థలం కనిపించదు. దీంతో ఆయా ప్రాంతాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రహదారులపై పార్కు చేస్తుండగా ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నట్లు పట్టణ ప్రజలు వాపోతున్నారు.

ఇరువైపులా టూ వీలర్లు

పట్టణంలోని దుకాణాదారులు నిబంధనలు అతిక్రమిస్తూ రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటుండగా, వీధి వ్యాపారులు తమ తోపుడు బండ్లు, బడ్డీ కొట్లను రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇక అక్కడో, ఇక్కడో వెడల్పు చేసిన రోడ్లను ద్విచక్ర వాహన యజమానులు తమ కోసమే విస్తరించారన్నట్లుగా ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం తొమ్మిది కాగానే ఆయా రోడ్లపై ద్విచక్ర వాహనాలు పార్క్‌చేసి దర్శనమిస్తున్నాయి. దీంతో నిత్యం ట్రాఫికర్ అవుతుండగా, పాదచారులు నడిచేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు.



గాంధీ విగ్రహం నుంచి మునిసిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలు



మిర్యాలగూడ పట్టణం లోని డాక్టర్స్ కాలనీలో పరిస్థితి ఇది

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. జనాభా, వాహనాలు పెరుగుతుండటంతో రద్దీ పెరుగుతోంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఇబ్బంది ఉండదు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవడం, రోడ్లమీదనే వాహనాలను పార్క్ చేయడం తగదు. ప్రధాన రోడ్ల నుంచి అంతర్గత రహదారులకు టర్న్ తీసుకునే తరుణంలో కాస్త అప్రమత్తంగా వెళ్లాలి. పాదచారులకు అంతరాయం కలిగించొద్దు. రాజశేఖరరాజు, డీఎస్పీ, మిర్యాలగూడ.

ఆ భూములను రికార్డుల నుంచి తొలగించాలి



సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న మట్టయ్య

మిర్యాలగూడ, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్, ఎస్ఎల్‌బీసీ కాల్వకు ప్రభుత్వం సేకరించిన భూములను రికార్డుల నుంచి తొలగించాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య కోరారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాడ్గులపల్లి మండలం గజలాపురం గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 86, 98లలో రైల్వే ట్రాక్ ఏర్పాటుకు, ఎస్ఎల్‌బీసీ కాల్వ నిర్మాణానికి ప్రభుత్వం భూములను సేకరించింది. అందుకుగాను భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించిందన్నారు. కాగా ఆ భూములను రికార్డులను తొలగించకపోవడంతో అదే సర్వే నెంబర్లపై భూమిని తిరిగి విక్రయిస్తున్నారన్నారు. మాడ్గులపల్లి తహసీల్దార్ నష్టపరిహారం పొందిన రైతులకే తిరిగి పట్టా పాస్‌బుక్‌లు మంజూరు చేయడంతో కొత్తగా భూముల విక్రయం సాగుతుందన్నారు. ఈ విషయమై సంబంధిత తహసీల్దార్ రికార్డులను సమగ్రంగా పరిశీలించి నష్టపరిహారం పొందిన భూములను రికార్డుల నుంచి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సర్వే నెంబర్లలో భూమిని విక్రయించిన రైతులపై చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరినట్లు వివరించారు.

'స్థానిక' ఎన్నికల్లో వైశ్యుల వాటా తేల్చాలి

● కాచం సత్యనారాయణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాచం సత్యనారాయణ, నాయకులు

హాలియా, జూలై28(ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల వాటా తేల్చాలని వైశ్య వికాస వేదిక, వైశ్య రాజకీయ రణభేరి చైర్మన్ కాచం సత్యనారాయణ అన్నారు. ఆగస్టు 3వ తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరి కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను సోమవారం హాలియాలో స్థానిక వైశ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్‌లో వర్గీకరణ తేవాలని, ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో చీదళ్ల లింగయ్య, వీరమళ్ల కృష్ణయ్య, వెంపటి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మంచుకొండ ప్రభాకర్, మిట్టపల్లి శ్రీనివాస్, చాణక్య, అట్టెం రవి, రాంమోహన్, పాంపాటి శ్రీనివాస్, మంచుకొండ వెంకటేశ్వర్లు, తేలపోలు శేఖర్ పాల్గొన్నారు.

లెవీ త్వరగా పూర్తి చేయాలి

చింతపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): లెవీ త్వరగా పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.రఘునందన్ తెలిపారు. సోమవారం చింతపల్లి మండలంలోని నసర్లపల్లిలో గల వెంకటసాయి రైస్‌మిల్లులో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు మిల్లులోని ధాన్యం పరిమాణంతోపాటు తూకాల్లో మోసం చేయకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లర్లకు సూచించారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

● అదనపు కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ నేతల వినతి

దేవరకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు దళితులకు ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ను కలిసి నల్లగొండలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అంబేడ్కర్ అభయ హస్తం ద్వారా ప్రతీ దళిత కుటుంబానికి రూ.12లక్షల రుణాలు ఇవ్వాలని, డప్పు, చెప్పు వృత్తిదారులకు నెలకు రూ.4వేల పింఛన్ ఇవ్వాలని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారయ్య మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు వెంకటయ్య, కాశయ్య, యాదయ్య, జిల్లా అధ్యక్షుడు సైదులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారని..

దేవరకొండ నియోజకవర్గంలో పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడంలేదని, దీంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. విచారణ జరిపి నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి : కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మునిసిపల్ కమిషనర్ జీ.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్తి, నీటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏళ్ల తరబడి పన్నులు చెల్లించని, మొండి బకాయిదారులకు నోటీసులు అందిస్తున్నామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పచ్చదనం పెంపునకు చర్యలు చేపట్టామన్నారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయనున్నామని, అందుకు స్థలాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇంకుడు గుంతల ఏర్పాటు, మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతన డంపింగ్ యార్డు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అన్వేషిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ వెంకన్న తదితరులున్నారు.

ఏఎమ్మార్పీ ఆయకట్టుకు నీటి విడుదల



ఏఎమ్మార్పీకి నీటిని విడుదల చేస్తున్న అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, జూలై28(ఆంధ్రజ్యోతి): డివిజన్-4 అంగడిపేట పరిధిలో ఉన్న ఆయకట్టుకు సోమవారం ఏఎమ్మార్పీ అధికారులు నీటిని విడుదల చేశారు. డిస్ట్రిబ్యూటరీ 5 నుంచి డిస్ట్రిబ్యూటరీ 18 వరకు ఆయకట్ట అవసరాల నిమిత్తం నీటిని విడుదలచేశారు. నల్లగొండ పట్టణవాసుల తాగునీటి అవసరాల కోసం ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ నుంచి ఉదయసముద్రానికి నీటి విడుదల కొనసాగుతోంది. ఈ నెల 10వ తేదీ నుంచి ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ ద్వారా మొదటి రోజు 200 క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు ప్రస్తుతం 1,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు ప్రారంభం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఏఎమ్మార్పీ డీఈ నాగయ్య 400 క్యూసెక్కులను డిస్ట్రిబ్యూటరీలకు విడుదల చేశారు. ఏఎమ్మార్పీ పుట్టంగండి నుంచి మూడు మోటర్ల ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని ఏకేబీఆర్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఏకేబీఆర్ నుంచి ఉదయ సముద్రానికి 1,100 క్యూసెక్కులు, జంటనగరాల అవసరాలకు 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 45క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మోహన్‌రెడ్డి మృతి బాధాకరం

● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నివాళి అర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

దేవరకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ దేవరకొండ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి తండ్రి రిటైర్డ్ వీఆర్వో మోహన్‌రెడ్డి మృతి బాధాకరమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుండెపోటుతో మృతి చెందిన మోహన్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. మోహన్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపిన వారిలో పీసీసీ సభ్యులు జాల నర్సింహారెడ్డి, ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, వడ్త్య దేవేందర్‌నాయక్, జాన్‌యాదవ్, చింతపల్లి సతీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నకిలీ ఓట్లను తొలగించాలి

● సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామరచర్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు స్థానికులుగా నకిలీ సర్టిఫికెట్ల ద్వారా ఓటరు లిస్టులో నమోదు చేసుకున్నారని, ఆ దొంగ ఓట్లను వెంటనే తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. దామరచర్ల మండలంలోని ఆంధ్రప్రదేశ్ ఓటర్లు దామరచర్ల, మిర్యాలగూడ మండలాల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం చూపిస్తారని, అధికారులు ఓటరు లిస్టును క్షుణ్ణంగా పరిశీలించి దొంగ ఓట్లను తొలగించాలన్నారు. ఏపీకి సరిహద్దు కావడంతో జీవనోపాధి కోసం వచ్చిన వారు కొందరు నాయకుల ద్వారా నకిలీ సర్టిఫికెట్లతో ఓటరు లిస్టులో పేరు నమోదు చేయించుకొని ఇక్కడ చలామణి అవుతున్నారని, అలాంటి ఓట్లను గుర్తించి అధికారులు తొలగించాలన్నారు. కార్యక్రమంలో జమ్ముల కోటయ్య, పేరుపొంగు లక్ష్మయ్య, రాములు, సులేమాన్, వినయ్, ధనుష్, మల్లమ్మ, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మాడ్గులపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నెకల్ గ్రామానికి చెందిన గంటెకంపు లక్ష్మమ్మ భర్త అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును సోమవారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మిర్యాలగూడలో అందజేసి మాట్లాడారు. ఆపదలో ఉన్న పేదలు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనవెంట గజలాపురం మాజీ సర్పంచ్ చామంతి నర్సింహ, నాయకలు దుబ్బ శివాజీ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాలరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్నెస్పీ స్టేడియంలో లిటిల్ ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. నిర్వాహకుడు మాయిద్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. తొలి మ్యాచ్‌లో కాకతీయ-ఎస్‌వీఆర్ జట్ల విద్యార్థులు పాల్గొన్నారరు. కార్యక్రమంలో ఎస్ఎస్వీ శ్రీనివాస్, ఆతీఫ్, అశోక్, రవి, వెంకట్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● మార్కెట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి



ప్రొసిడింగ్ ఆర్డర్‌ను అందజేస్తున్న నాయకులు

హాలియా, జూలై 28(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఆదేశాలతో అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు భూమి పూజలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో దశలవారీగా అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రియాజ్, నాయకులు అలుగుల బ్రహ్మారెడ్డి, అలుగుల చినవెంకట్‌రెడ్డి, అలుగుల రమణారెడ్డి, సజ్జల రఘుపతిరెడ్డి, కోట నాగిరెడ్డి, ఉడుతూరి ప్రభాకర్‌రెడ్డి, కృష్ణమాచారి, నాగయ్య, బూడిద ఏసు, గార్లపాటి శేఖర్, గోవర్ధన్, కనకరాజు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

(5వ పేజీ తరువాయి)



పూర్తిగా నిండిపోవడంతో ఇప్పటికే కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 4.46 టీఎంసీలకు 3.99 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకోంది. ప్రతిరోజూ ఎగువనుంచి దాదాపు 1,280 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అంతే మొత్తంలో రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద నీటివిడుదల కొనసాగుతుండడంతో ఆయకట్టులో కుడికాల్వ కింద కేతేపల్లి, వేములపల్లి, మాడుగులపల్లి మండలాల్లోని గ్రామాల్లో, ఎడమకాల్వ కింద సూర్యాపేట, పెన్‌పహాడ్, చివ్వెంల మండలాల్లో ఆయకట్టులో వరినాట్లు ఉధృతమయ్యాయి. ఈ వారాంతంలో ఆయకట్టులో నాట్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.

శాలిగౌరారం దాదాపు పూర్తయిన వరినాట్లు:

మూసీ నదిపై ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు నీటితో నిండిపోయింది. శాలిగౌరారం మండలంలో దాదాపు ఆరువేల ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టు కింద రెండు కాల్వలకు నీటివిడుదల కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే దాదాపు వరినాట్లు పూర్తయ్యాయి. ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో సమీపంలోని బోరుబావుల్లోకి సైతం నీటిమట్టాలు పెరగడంతో నాన్ ఆయకట్టులోనూ వరినాట్లు కొనసాగుతున్నాయి.

వరద కాల్వకు 300 క్యూసెక్కుల నీరు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో వరదకాల్వ(లోలెవల్ కాల్వ)కు సైతం అధికారులు సోమవారం 300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదలచేశారు. హాలియా మండలంలోని యాచారం వరకు నీరు ఇప్పటికే రాగా, నీటివిడుదల కొనసాగుతుండడంతో మంగళవారం రాత్రికి చివరి వరకు నీరు చేరుతుందని అంచనావేస్తున్నారు. ఈ కాల్వ కింద పెద్దవూర, హాలియా, నిడమనూరు, త్రిపురారం, మాడుగులపల్లి, కనగల్లు మండలాల్లో దాదాపు 50వేల ఎకరాలకు సాగునీరందుతుంది. అంతేకాకుండా సమీపంలోని చెరువులను నింపడం ద్వారా బోరుబావులలో నీటిమట్టాలు పెరుగుతాయి. తద్వారా ప్రత్యక్ష ఆయకట్టుతో పాటుగా, బోరుబావుల కింద సైతం సాగుకు భరోసా దక్కుతుంది. ఈ ఆయకట్టు కింద ఇప్పటికే రైతులు నారుమళ్లు సాగు చేయగా, నీటివిడుదలతో నాట్లకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నీటిని విడుదల చేయాలంటోన్న రైతులు

ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులన్నీ నీటితో నిండిపోవడంతో ప్రాజెక్టుల కింద కాల్వలకే కాకుండా సాగర్ ఎడమకాల్వపై నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఉన్న దాదాపు 45 వరకు ఉన్న ఎత్తిపోతల పథకాలకు సైతం నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. మేజర్లతో పాటుగా, వీటికి సైతం సకాలంలోనే నీటిని విడుదల చేస్తేనే సీజన్‌లో రైతులకు ఇబ్బంది ఉండదని ఆ దిశగా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పలు ఎత్తిపోతల పథకాలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సి ఉందని, తక్షణమే వాటిని పూర్తి చేసి నీరందించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.